Follow: @ANNTELUGU
03-02-2025
ANN తెలుగు
మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 63 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## తెలుగు బిడ్డ సంచలనం..

### వరల్డ్ కప్ విన్నర్‌గా భారత్

అభినందించిన పీఎం మోదీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి క్రికెట్‌లో భారత్ సూపర్‌పవర్ అని మరోమారు రుజువైంది. తిరుగులేని శక్తిగా ఇంటర్నేషనల్ క్రికెట్‌లో రచ్చ చేస్తోంది టీమిండియా. తాజా విజయంతో మన బలం మరింత పెరిగింది. భారత అమ్మాయిలు అద్భుతం చేసి చూపించారు. అండర్ 19 టీ20 ప్రపంచ కప్ విజేతగా భారత్ ఆవిర్భవించింది. ఫైనల్ ఫైట్‌లో సౌతాఫ్రికా నిర్దేశించిన 83 పరుగుల లక్ష్యాన్ని కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి చేజ్ చేసింది. తెలుగు బిడ్డ గొంగడి త్రిష బ్యాటింగ్‌లో 44 పరుగులు అద్వితీయ ఇన్నింగ్స్ ఆడటమే గాక బౌలింగ్‌లో 15 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టి సంచలన ప్రదర్శన చేసింది. భారత్ చాంపియన్‌గా నిలవడంలో త్రిష కీలక పాత్ర పోషించింది. దీంతో అంతా ఆమెను మెచ్చుకుంటున్నారు.

వివరాలు 8లో

**టాప్ న్యూస్**

## బీజేపీ గెలుపు... ఢిల్లీకి మలుపు



- ఆప్ నేతలు అవినీతికి ఆనవాళ్లు
- బీజేపీ గెలిస్తే ప్రతి మహిళకు నెలనెలా రూ.2,500లు ఇస్తాం
- ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడి
- ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పాల్గొన్న కేంద్ర మంత్రి

02

## కాంగ్రెస్‌లోకి సంజయ్ రౌత్..?



- మహారాష్ట్ర పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ
- అవునంటున్న బీజేపీ నేత నితీష్ రాణే

03

## జనగణన ఇంకెప్పుడు చేస్తారు..?



- కేంద్రాన్ని నిలదీసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- కులగణన నివేదిక నేపథ్యంలో జాగృతి నేతలతో భేటీ

03



## మహాకుంభ్‌లో 34 కోట్ల మంది పవిత్ర స్నానాలు

- ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్
- కుంభమేళాకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు బురద జల్లుతున్నాయని వెల్లడి..

03



## ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి

- ఉద్యోగాలు, రాజకీయాల్లో బీసీల అణచివేత
- వరంగల్ బీసీ యుద్ధభేరి సభలో తీన్మార్ మల్లన్న
- హాజరైన క్రిష్ణయ్య, మోత్కుపల్లి

03



## భువనేశ్వరి, బాలయ్య మధ్య నలిగిపోతున్నాను

- ఏపీ సీఎం చంద్రబాబు చమత్కారం
- బాలకృష్ణకు పద్మభూషణ్
- తన ఫాంహౌస్ లో ఫ్యామిలీ పార్టీ ఏర్పాటు చేసిన నారా భువనేశ్వరి
- హాజరైన చంద్రబాబు
- ఆద్యంతం ఉల్లాసంగా కార్యక్రమం

03

# రాహుల్ ఆశయం

**తెలంగాణ ప్రభుత్వ సంకల్పం.. తేలిన కులాల లెక్కలు.. దేశంలోనే ఫస్ట్ టైం**


## తెలంగాణలో బీసీ జనాభా 56.33శాతం..

- బీసీల జనాభా 46.25 శాతం.. ముస్లిం మైనారిటీల బీసీల జనాభా 10.08
- కేబినెట్ సబ్ కమిటీకి అందిన రిపోర్ట్.. అధికారికంగా ప్రకటించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి కమిటీ
- సబ్ కమిటీలో ఉత్తమ్, సీతక్క, పొన్నం, దామోదర
- 3.54 కోట్ల మందిని సర్వే చేసినట్లు ప్రకటించిన అధికారులు
- పట్టుదలగా పూర్తిచేసిన రేవంత్ ప్రభుత్వం.. పర్యవసానాలు ఎలా ఉన్నా.. లెక్కలు తేల్చేసిన సర్కార్
- ఫిబ్రవరి 4న కేబినెట్ ముందుకు కులగణన సర్వే.. ఢిల్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ కు అడ్వాంటేజ్

"తెలంగాణలో కులాల లెక్క తేలింది. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆశయం మేరకు సామాజిక, కులగణన సర్వేను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిచేసింది. రాష్ట్రంలో కులగణన, సామాజిక సర్వే నివేదిక మంత్రులు ఉత్తమ్, సీతక్క, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలోని కేబినెట్ సబ్ కమిటీకి అందింది. కులగణన, సామాజిక సర్వేలో రాష్ట్రంలోని 3.54 కోట్ల మంది వివరాలు అందించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఈ కులగణన, సామాజిక సర్వే నివేదికను మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు ప్రకటించారు.

- మహా, హైదరాబాద్

02







## 15లోగా ఎన్నికల నోటిఫికేషన్

### 4న ప్రత్యేక అసెంబ్లీ.. కులగణన సర్వేకు ఆమోదం

**దేశవ్యాప్తంగా కులగణన సర్వే చేయాలని కేంద్ర్రానికి తీర్మానం**

**బిసి రిజర్వేషన్లు ఖరారు.. అదే ఊపులో స్థానిక ఎన్నికలకు**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ అసెంబ్లీ ఈ నెల 4వ తేదీ ప్రత్యేకంగా జరుగనుంది. ఉదయం 11 గంటలకు అసెంబ్లీ సమావేశం ప్రారంభం కానుంది. 11 గంటలకు కుల గణన సర్వేను సభలో ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి రేవంత్ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే దీని కంటే ముందే బీసీ కులగణనపై ఓ నిర్ణయానికి రావాలని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగానే కులగణన చేపట్టింది. అసెంబ్లీ సమావేశాల్లో బీసీ కులగణనపై చర్చించనుంది. దీని కోసం ఈ నెల 4వ తేదీన అసెంబ్లీ సమావేశం నిర్వహిస్తోంది. ఇప్పటికే కేబినెట్ సబ్‌కమిటీకి ప్లానింగ్ కమిషన్ అధికారులు కులగణన నివేదిక అందజేశారు. బీసీ రిజర్వేషన్లను పెంచడం కోసం కీలక నిర్ణయం తీసుకుని, పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానించి, ఆ తర్వాత కేంద్రానికి పంపే అవకాశాలు ఉన్నాయి.

మిగతా 2లో

## 27 జిల్లాలకు బీజేపీ అధ్యక్షుల ఖరారు

### జాబితా విడుదలే ఆలస్యం

**మహా :** బీజేపీ జిల్లా అధ్యక్షుల పేర్లను ఒకటి రెండు రోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది. అధ్యక్షుల జాబితాపై బీజేపీ శ్రేణులు దీనిపై ఉత్కంఠ మొదలైంది. శనివారం 25 జిల్లాల ఆశావహుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. చాలా ఉత్కంఠతల మధ్య ఇవాళ హైదరాబాద్, సికింద్రాబాద్ జిల్లలకు నామినేషన్లను

మిగతా 3లో

## బీజేపీపై యుద్ధం ప్రకటిస్తున్నా..

- తెలంగాణ పట్ల ప్రేమ ఉంటే బండి సంజయ్, కిషన్ రెడ్డిలు రాజీనామా చేయాలి
- కేంద్రంపై భగ్గుమన్న పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- ట్యాంక్ బండ్ వద్ద భారీ నిరసన
- రాజకీయాలు పక్కనబెట్టి రాష్ట్రం కోసం అందరూ కలిసిరావాలని పిలుపు
- నేడు జిల్లాల్లో నిరసనలకు పిలుపు



**హైదరాబాద్, మహా :** సాధారణ బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం మొండిచేయి చూపినందుకు నిరసనగా డాక్టర్ బాబా సాహెబ్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం సాక్షిగా బీజేపీపై యుద్ధం ప్రకటిస్తున్నట్లు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. సాధారణ బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రంపై వివక్షకు నిరసనగా ఆదివారం ట్యాంక్ బండపై ఉన్న బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో భారీ నిరసన చేపట్టారు. అనంతరం పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 3వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక బీఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ కేడర్‌కు ఆయన పిలుపు నిచ్చారు. తెలంగాణ సంక్షేమం, అభివృద్ధి, రాజకీయాలు పక్కన పెట్టి పార్టీలకు అతీతంగా అందరు కలిసి రావాలని ఆయన సూచించారు. రాష్ట్రానికి కేంద్ర నిధులు ఇచ్చే వరకు శాంతియుతంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డికి రాష్ట్రాభివృద్ధి పట్టదా? అంటూ వారిని పీసీసీ చీఫ్ నిలదీశారు. తెలంగాణ పట్ల ప్రేమ ఉంటే బండి సంజయ్, కిషన్ రెడ్డిలు తమ కేంద్ర మంత్రి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం సీఎం రేవంత్, మంత్రులు ఒంటరి పోరాటం చేస్తున్నారని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, గ్రేటర్ హైదరాబాద్ నేతలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేల భేటీ నిజమే


### అది రహస్య భేటీ కాదు

- నియోజకవర్గాల అభివృద్ధి కోసం కలిసి మాట్లాడుకోవద్దా అని ప్రశ్న
- అధిష్టానానికి చెప్పాల్సింది చాలానే ఉందన్న అనిరుధ్ రెడ్డి

**మహా :** అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు రహస్యంగా భేటీ అయ్యారన్న వార్తలపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పందించారు. ఎమ్మెల్యేలు సమావేశమైన మాట నిజమేనని స్పష్టం చేసారు. కానీ తాము రహస్యంగా భేటీ కాలేదని చెప్పారు. నియోజకవర్గాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యేలు కలిసి మాట్లాడుకోవద్దా?

మిగతా 2లో






## తెలంగాణకు ఎవరేం చేశారో చర్చకు సిద్ధమా..?

- చర్చకు రావాలంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు బీజేపీ సవాల్
- కళ్ళుండి చూడలేని కబోదులు బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు
- తీవ్ర స్థాయిలో మండిపడ్డ బీజేపీ నేత లక్ష్మణ్

వివరాలు 3లో



## అక్షింతలు తప్ప అభివృద్ధి చేయని బీజేపీ

- నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యం
- తీవ్ర స్థాయిలో మండిపడ్డ మంత్రి సీతక్క



02

# ఢిల్లీ సంగ్రామం

## బీజేపీ గెలుపు... ఢిల్లీకి మలుపు

**ఆప్ నేతలు అవినీతికి ఆనవాళ్లు**

- బీజేపీ గెలిస్తే ప్రతి మహిళకు నెలనెలా రూ.2,500లు ఇస్తాం
- ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడి
- ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పాల్గొన్న కేంద్ర మంత్రి



**మహా :** అవినీతి ఊబిలో కూరుకుపోయిన ఆమ్ ఆద్మీ పార్టీని కూకటి వేళ్లతో పెకిలించి వేయాల్సిన సమయం వచ్చిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఢిల్లీ ప్రజలకు పిలుపునిచ్చారు. ఢిల్లీలో రూ.28 వేల400 కోట్ల జల్ బోర్డ్ కుంభకోణం, రూ.4,500కోట్ల బస్సుల కొనుగోలు కుంభకోణం, బస్సుల్లో సదుపాయాల పేరుతో రూ.500కోట్ల దుర్వినియోగం, నకిలీ హెల్త్ టెస్టుల ద్వారా కోట్ల రూపాయల అక్రమాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదివారం ఈస్ట్ ఢిల్లీ, షాద్రా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లో బనియా, బ్రాహ్మణ, వాల్మీకీ సామాజికవర్గ ప్రజలు అధికంగా నివాసముండే ప్రాంతాల్లో బండి సంజయ్ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ బీజేపీ అభ్యర్థులకు ఓటేయాలని కోరారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, ఆడంబరాలకు, అవినీతికి దూరంగా ఉంటూ పాలన కొనసాగిస్తామని అధికారంలోకి వచ్చిన ఆప్ నేతలు విలాసవంతమైన జీవితాలను గడుపుతూ ప్రజా ధనాన్ని దోచుకుతిన్నారని మండిపడ్డారు. ప్రజలను మాత్రం బిచ్చగాళ్లుగా మార్చారని విమర్శించారు. అధికారంలోకి రాకముందు సాదాసీద జీవితం గడిపిన ఆప్ ఎమ్మెల్యేలు అధికారంలోకి వచ్చాక అనూహ్యంగా ఆస్తులు పెంచుకున్నారని ఆరోపించారు. ఢిల్లీ మద్యం స్కాం తెలంగాణకు విస్తరించిందని, ఈ స్కాం ఢిల్లీ ప్రజలు తలదించుకునేలా చేసిందన్నారు. ఈ కుంభకోణంలో ప్రధాన ముద్దాయిలుగా కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, బీఆర్ఎస్ నేత కవిత ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. అవినీతి కేసుతో జైలుకు వెళ్లిన కేజ్రీవాల్ కోర్టు ఒత్తిడి చేస్తే బలవంతంగా రాజీనామా చేయకపోవడం ఆయన స్వార్థపూరిత రాజకీయాలకు నిదర్శనంగా నిలుస్తుందని మండిపడ్డారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేతల అబద్ధపు, మోసపూరిత రాజకీయాలతో ఢిల్లీ ప్రజలు విసిగిపోయారన్నారు. మార్పు కోసం, ఢిల్లీ అభివృద్ధి కోసం బీజేపీవైపు ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీజేపీ బంపర్ మెజారిటీతో గెలిచి అధికారంలోకి రావడం తథ్యమన్నారు.


బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 'మహిళా సమృద్ధి యోజన' పథకం కింద అర్హులైన పేద మహిళలకు నెలకు రూ. 2500 ఆర్థిక సహాయం, రూ.500 లకే ఉచిత గ్యాస్ సిలిండర్, ముఖ్యమంత్రి మాతృత్వ భద్రతా పథకం కింద గర్భిణీ స్త్రీలకు రూ. 21,000తోపాటు 6 పోషకాహార కిట్లను అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తామని, దీని ద్వారా అర్హత కలిగిన లబ్ధిదారులకు రూ. 10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు. దీంతోపాటు బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేస్తామన్నారు.

## ఆప్ 11 ఏళ్లు వేస్ట్ చేసింది

**ఫిబ్రవరి 8న ఢిల్లీలో కొత్త వసంతం**

**ఢిల్లీలో ఓటింగ్‌కు ముందే చీపురు పుల్లలు ఊడుతున్నాయ్**

**అవినీతి సొమ్ము తిరిగి ఇచ్చేయాల్సిందే**



**ఢిల్లీ, మహా:** ఢిల్లీలో ఈసారి బీజేపీదే అధికారమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఫిబ్రవరి 8న బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు మహిళలు 2,500 అందుకుంటారని చెప్పారు. ఆర్కేపురం ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ప్రధాని మోదీ, ఆప్ ప్రభుత్వం అసత్యాలు ప్రచారం చేస్తోందని విమర్శించారు. ఢిల్లీలో ఏ ఒక్క గుడిసెను తొలగించబోమని, అన్ని సంక్షేమ పథకాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆరోగ్యం రంగంలోనూ 'ఆపద' ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని, ప్రజలను దోచుకున్నవారు తిరిగి ఇచ్చేయాల్సి ఉంటుందని ప్రధాని హెచ్చరించారు. 'వసంత పంచమి తర్వాత వాతావరణంలో మార్పు ప్రారంభమవుతుంది. 3 రోజుల తర్వాత ఫిబ్రవరి 5న దిల్లీలో అభివృద్ధికి సంబంధించిన కొత్త వసంతం రానుంది. ఈ సారి ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కానుంది. ఇప్పుడు మనం చూస్తున్నాం. ఢిల్లీలో ఓటింగ్‌కు ముందే చీపురు పుల్లలు ఎలా ఊడుతున్నాయో చూస్తున్నాం. ఆప్ నాయకులు ఆ పార్టీని వదిలివెళ్తున్నారు. క్షేత్రస్థాయిలో ఆప్‌పై ప్రజలు ఎంత నిరాశతో ఉన్నారో, ఎంత వ్యతిరేకత ఉందో వారికి తెలుసు' అని మోదీ అన్నారు.

**ఒక్క మురికివాడను కూడా కూల్చం**

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తే ఢిల్లీలోని ఒక్క మురికివాడను కూడా కూల్చమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే మురికివాడలను లక్ష్యంగా చేసుకుందంటూ ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ చేసిన ఆరోపణలను ప్రధాని కొట్టివేశారు. ఒక్క మురికివాడను కూడా తాము కూల్చే ప్రసక్తి లేదన్నారు. ఆప్ తమ ప్రకటనతో ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని, తాము ప్రచారం కోసం ప్రకటనలు చేయమని, చేసిన వాగ్దానాలను నిలబెట్టుకునేందుకు బడ్జెట్‌లో వెసులుబాట్లు కల్పిస్తామని మోదీ పేర్కొన్నారు



## ఈసారి కూడా మాదే ఢిల్లీ

**ఓటమి భయంతో బిజెపి గూండాయిజం: కేజ్రీవాల్**

**ఢిల్లీ, మహా :** ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ చారిత్రాత్మక విజయందిశగా సాగుతుండగా, బీజేపీ పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది' అని ఆప్ జాతీయ సమన్వయకర్త కేజ్రీవాల్ అన్నారు. ఓటమి భయంతో కమలం పార్టీ ఢిల్లీలో గూండాయిజం చేస్తోందని ఆరోపించారు. ప్రజలపై దాడులు చేస్తున్న బీజేపీ శ్రేణులపై చర్యలు తీసుకోకుండా పోలీసులకు ఆదేశాలు వెళ్లాయని కేజ్రీవాల్ విమర్శించారు. ఢిల్లీలో ఈ విధమైన ఎన్నికలను ప్రజలు ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదన్నారు. బీజేపీ గూండాయిజానికి వ్యతిరేకంగా ఏకం కావాల్సిన అవసరం ఉందని దిల్లీ ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ గూండాయిజాన్ని దేశం దృష్టికి తెచ్చేందుకు ప్రత్యేక హ్యాష్‌ట్యాగ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ లేదా అధికార యంత్రాంగం దాడులు చేసినా వేధింపులు గురిచేసినా ఈ హ్యాష్‌ట్యాగ్ ద్వారా సమాచారం ఇవ్వాలని కేజ్రీవాల్ కోరారు.

## పొలిటికల్ పొల్యూషన్‌తో ఢిల్లీ కలుషితం

**కేజ్రీవాల్ వల్లే ఢిల్లీలో అభివృద్ధి ఆగిపోయింది**

**దేశానికి సరైన నాయకుడు మోదీ మాత్రమే**

**ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో దుమ్మురేపిన చంద్రబాబు**



**ఢిల్లీ, మహా:** ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. కేజ్రీ నీ గొప్పలు బంద్ జేయ్ అని విమర్శించారు. బీజేపీ అభ్యర్థి సంజయ్ గోయల్‌ను ఈ ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో చాలామంది తాను వస్తున్నానంటే ఏం చెబుతారో వినడానికి వచ్చారని అన్నారు. ఢిల్లీలో ఉండే తెలుగు వారు అందరూ ఏకపక్షంగా బీజేపీకి ఓటు వేస్తారని చెప్పారు. తెలుగు వారు ఢిల్లీలోనే కాదు ప్రపంచ దేశాల్లో ఉన్నారని తెలిపారు. ఢిల్లీలో ఇంతమంది తెలుగువారు ఉంటారని అనుకోలేదని చెప్పారు. దావోస్ జూరిక్‌లో 650 మంది తెలుగువారు ఉన్నారన్నారు. మోదీ నాయకత్వాన్ని ప్రపంచ దేశాలు హర్షిస్తున్నాయని చెప్పారు. 1995లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గురించి తాను మాట్లాడానని అన్నారు. ఇప్పుడు ప్రతి ఇంటికి ఒక ఏఐ తయారు కావాలని చెప్పారు. ఢిల్లీలో ఉన్న తెలుగు తమ్ముళ్లు ఇంటింటికీ వెళ్లి బీజేపీ గెలుపు దేశ చరిత్రకు మలుపు అనేలా చెప్పాలని అన్నారు. సరైన నాయకుడు మనదేశానికి సరైన సమయంలో ఉన్నారని.. ఆయనే మోదీ అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. "ఆర్థిక వ్యవస్థ,టెక్నాలజీలో ముందు ఉన్నాం. భారతదేశం బ్రాండ్ మోగడానికి మోదీ కారణం. 2047 నాటికి భారత్ నెంబర్‌వన్‌గా తయారవుతుంది. ఢిల్లీని చూస్తుంటే చాలా భాధగా ఉంది. 1993లో హైదరాబాద్ ఎలా ఉందో ఢిల్లీ ఇప్పుడు అలానే ఉంది. ఢిల్లీలో డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చి ఉంటే ఢిల్లీ వాషింగ్‌టన్ లాగా ఉండేది. ఢిల్లీలో పొల్యూషన్ పెరిగిపోయింది. ఆ గాలితో ప్రజలు ఎలా ఉన్నారో తెలియడం లేదు. చాలామంది హైదరాబాద్, బెంగుళూర్ వెళ్లాలని అనుకుంటున్నారు. ఢిల్లీలో రాజకీయ పొల్యూషన్‌తో ఢిల్లీ కలుషితం అయ్యింది. ఢిల్లీలో కమలం పార్టీ గెలిస్తే హస్తిన బాగుపడుతుంది. నరేంద్ర మోదీ మోక్షం ఇస్తే తప్ప ఢిల్లీ బాగుపడదు. ఢిల్లీ అభివృద్ధి కావాలంటే బీజేపీ అధికారంలోకి రావాలి. భారతదేశానికి ప్రపంచం మొత్తం గుర్తింపు వచ్చింది. అలాంటి ఢిల్లీ సమస్యల వలయంలో చిక్కుకుంది. పదేళ్లలో ఏం చేశారంటే స్కూళ్లు పెట్టమని అంటున్నారు. ఢిల్లీ మురికి కుపం లాగా మారింది. ఢిల్లీలో స్వచ్ఛమైన మంచినీరు తాగే పరిస్థితి లేదు. బీహార్ నుంచి ఉపాధికి ఢిల్లీ వచ్చే వారు...ఇప్పుడు అందరూ సౌత్ ఇండియాకు వస్తున్నారు. ఢిల్లీలో అభివృద్ధి ఆగిపోయింది. బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో బెస్ట్‌గా ఉంది. ప్రతి మహిళకు రూ. 2500 , గ్యాస్ సిలిండర్ హోలీ పండుగకు ఫ్రీగా ఇస్తామని ప్రకటించారు. అనేక పథకాలు బీజేపీ మేనిఫెస్టోలో పెట్టింది" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# రాహుల్ ఆశయం

## తెలంగాణ ప్రభుత్వ సంకల్పం..

**తేలిన కులాల లెక్కలు.. దేశంలోనే ఫస్ట్ టైం**

**తెలంగాణలో బీసీ జనాభా 56.33శాతం..**

- బీసీల జనాభా 46.25 శాతం.. ముస్లిం మైనారిటీల బీసీల జనాభా 10.08
- కేబినెట్ సబ్ కమిటీకి అందిన రిపోర్ట్.. అధికారికంగా ప్రకటించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి కమిటీ
- సబ్ కమిటీలో ఉత్తమ్, సీతక్క, పొన్నం, దామోదర
- 3.54 కోట్ల మందిని సర్వే చేసినట్లు ప్రకటించిన అధికారులు
- పట్టుదలగా పూర్తిచేసిన రేవంత్ ప్రభుత్వం.. పర్యవసానాలు ఎలా ఉన్నా.. లెక్కలు తేల్చేసిన సర్కార్
- ఫిబ్రవరి 4న కేబినెట్ ముందుకు కులగణన సర్వే.. ఢిల్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ కు అడ్వాంటేజ్



**హైదరాబాద్, మహా:** తెలంగాణలో కులాల లెక్క తేలింది. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆశయం మేరకు సామాజిక, కులగణన సర్వేను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిచేసింది. రాష్ట్రంలో కులగణన, సామాజిక సర్వే నివేదిక మంత్రులు ఉత్తమ్, సీతక్క, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలోని కేబినెట్ సబ్ కమిటీకి అందింది. కులగణన, సామాజిక సర్వేలో రాష్ట్రంలోని 3.54 కోట్ల మంది వివరాలు అందించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఈ కులగణన, సామాజిక సర్వే నివేదికను మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు న్యాయం చేయాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అని మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కులగణన అంశంపై ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా కేబినెట్ సబ్‌కమిటీకి రిపోర్ట్ సమర్పించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆశయం మేరకు రాష్ట్రంలో సామాజిక, కులగణన సర్వే చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కులగణన చేయాలని అసెంబ్లీ తీర్మానించిందని చెప్పారు. బలహీనవర్గాల అభ్యున్నతికి అవసరమైన వివరాల సేకరణకు కులగణన చేపట్టినట్లు వెల్లడించారు.

**రాష్ట్ర చరిత్రలో సంచలనం**

సామాజిక కులగణన సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్లు పాల్గొన్నారని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 3.54 కోట్ల మంది ప్రజలు సర్వేలో పాల్గొని వివరాలు అందించారని చెప్పారు. ఇది రాష్ట్ర జనాభాలో 96.9 శాతం అని వెల్లడించారు. రాష్ట్రంలోని 3.1శాతం మంది అంటే 16 లక్షల మంది పలు కారణాల వల్ల వివరాలు అందించలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందులో ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి సహా పలు అంశాలపై సమగ్ర అధ్యయనం జరిగిందని చెప్పారు. ఈ కులగణనను అడ్డుకోవాలని కొందరు ప్రయత్నించినా అధికారులు సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈనెల 4వ తేదీన కేబినెట్ ముందు కులగణన సర్వే నివేదికను ప్రవేశపెడతామని ఉత్తమ్ స్పష్టం చేశారు. అదే రోజున అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కేబినెట్‌లో చర్చించిన వెంటనే దాన్ని అసెంబ్లీలో ప్రవేశ పెడతామని తెలిపారు.

## ప్రీజం పబ్ కాల్పుల కేసులో నిందితుడు అసాధ్యుడు

**తోటి ఖైదీని చంపేందుకు పథకం.. ఇంజనీరింగ్ కళాశాలలే అతడి టార్గెట్**

**బత్తుల ప్రభాకర్ వద్ద మూడు తుపాకులు, 428 బుల్లెట్లు స్వాధీనం**

**బీహార్ గ్యాంగ్ నుంచి తుపాకులు కొనుగోలు**

**గతంలో పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్న ఘనుడు**



**మహా :** గచ్చిబౌలీలోని ప్రీజం పబ్ లో పోలీసులపై కాల్పులు జరిపి తప్పించుకునేందుకు ప్రయత్నించిన నిందితుడు అసాధ్యుడని పోలీసులు గుర్తించారు. చిత్తూరు జిల్లాకు చెందిన బత్తుల ప్రభాకర్ పాత నేరస్థుడు. 2013 నుంచి అనేక నేరాలతో సంబంధం ఉంది. అతడిపై ఏపీ, తెలంగాణలో దాదాపు 80 కేసులు నమోదయ్యాయి. 2022 మార్చిలో విచారణ నిమిత్తం పోలీసులు విశాఖపట్టణం జైలు నుంచి అనకాపల్లికి తీసుకు వెళ్తుండగా పోలీసుల నుంచి తప్పించుకు పారిపోయాడు. అప్పటి నుంచి ఏపీ పోలీసులు ప్రభాకర్ కోసం వెతుకుతున్నారు. పోలీసులకు కనపడకుండా తిరుగుతున్న ప్రభాకర్ బీహార్ గ్యాంగ్ నుంచి మూడు తుపాకులు కొనుగోలు చేశాడు. అనంతరం తిరిగి దొంగతనాలకు పాల్పడటం ప్రారంభించాడు. పేరొందిన ఇంజనీరింగ్ కళాశాలలే టార్గెట్ గా ప్రభాకర్ చోరీలకు పాల్పడుతున్నాడు. కళాశాలల్లో ప్రవేశాలు, పరీక్షలు, హాస్టల్ ఫీజుల వసూళ్ళు లాంటి డబ్బులు నిలువ ఉంటాయన్న విషయాన్ని పసిగట్టి చోరీలకు పాల్పడ్డాడు. కొద్ది రోజులుగా నార్సింగి, మొయినాబాద్ తదితర ప్రాంతాలలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో జరిగిన దొంగతనాలలో పోలీసులు వేలి ముద్రలను సరిపోల్చగా ప్రభాకర్ వేలి ముద్రలతో సరితూగాయి. దీంతో పోలీసులు అతడిపై ప్రత్యేక నిఘా పెట్టారు. చోరీలకు పాల్పడగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసే అలవాటున్న ప్రభాకర్ కోసం గాలిస్తున్న పోలీసులు గచ్చిబౌలితో పాటు నగరంలోనూ, శివార్లలోనూ ఉన్న పబ్ లు, పేరొందిన బార్లు తదితర వాటిల్లో పని చేసే సిబ్బందికి ప్రభాకర్ ఫొటోలను ఇచ్చి వస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ నేపథ్యంలో ప్రజీం పబ్ కు వెళ్ళిన ప్రభాకర్ సమాచారం పోలీసులకు అందడంతో అతడిని పట్టుకునేందుకు పోలీసులు రావడం, క్రమంలో పోలీసులపై కాల్పులకు తెగబడి తప్పించుకునేందుకు ప్రయత్నించి పట్టుబడ్డాడు.

ఘటనా స్థలంలోనే ప్రభాకర్ ను పట్టుకున్న పోలీసులు నిందితుడి నుంచి రెండు తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడి గదిని సోదా చేయగా మరో తుపాకీ బయటపడింది. నిందితుడు ప్రభాకర్ కొంత కాలంగా ఐటీ కంపెనీలో పని చేస్తున్న తన మిత్రుడి గదిలో ఉంటున్నట్లు పోలీసులు గుర్తించారు. విశాఖపట్టణం జైల్లో ఉన్న సమయంలో ప్రభాకర్ ను తోటి ఖైదీ వేధింపులకు గురి చేశాడని, అతడిని హత్య చేసేందుకు పథకం వేసిన ప్రభాకర్ బీహార్ గ్యాంగ్ నుంచి తుపాకులను కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్రభాకర్ 66 కేసుల్లో నిందితుడని, మరో 28 కేసులు విచారణలో ఉన్నాయని. అతడి వద్ద నుంచి మూడు తుపాకులు, 428 బుల్లెట్ లను స్వాధీనం చేసుకున్నట్లు మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు.



## అక్షింతలు తప్ప అభివృద్ధి చేయని బీజేపీ

**నిధుల కేటాయింపు లో తీవ్ర నిర్లక్ష్యం**

**తీవ్ర స్థాయిలో మండిపడ్డ మంత్రి సీతక్క**

**మహా :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అక్షింతలు ఇస్తూ ప్రజలను మభ్య పెడుతుంది తప్ప అభివృద్ధి విషయంలో వివక్ష చూపుతుందని మంత్రి సీతక్క మండిపడ్డారు. శనివారం ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు నిధుల విషయంలో చూపిన వివక్షను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆదివారం ట్యాంక్ బండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్ర మంత్రులు, ప్రధాని వద్దకు ఎన్ని సార్లు వెళ్ళినా చివరకు మొండి చేయి చూపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి కేంద్రానికి వెళ్తున్న పన్నులను దృష్టిలో పెట్టుకొని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని, అయినప్పటికీ పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. నిన్నటి బడ్జెట్ ఎన్నికల బడ్జెట్ తప్ప కేంద్ర బడ్జెట్ కాదన్నారు. నిర్మలమ్మ ప్రవేశ పెట్టింది. బీజేపీ బడ్జెట్ స్వార్థ బడ్జెట్ అని సీతక్క వ్యాఖ్యానించారు. మొదటి నుంచీ తెలంగాణ అంటే బీజేపీ కి పిచ్చి విద్వేషమని, అడుగడుగునా తెలంగాణను మోదీ ప్రభుత్వం కించపరిచే విధంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎంతో శ్రమిస్తోందని, రాష్ట్రానికి సహకరించాల్సిన కేంద్రం సహాయ నిరాకరణ చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ ఉన్న నిధులతో అభివృద్ధి సంక్షేమం చేస్తుందన్నారు. బీజేపీ వాళ్ళు కేవలం అయోధ్య నుంచి అక్షింతలు పంచడం తప్ప అభివృద్ధి కి నిధులు ఇవ్వడం లేదని సీతక్క వ్యాఖ్యానించారు. విభజన చట్టం లోని హామీలు మూడు సార్లు అధికారం లోని వచ్చిన అమలు చేయలేదన్నారు. అక్షింతలకు ఓట్లు వేద్దామా, అభివృద్ధికి ఓటు వేద్దామా అన్న విషయాన్ని ప్రజలు ఆలోచించాలని సీతక్క పిలుపునిచ్చారు. చేసిన తప్పును తెలుసుకుని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ కు నిధులు కేటాయించాలని సీతక్క డిమాండ్ చేశారు.

## 15లోగా ఎన్నికల నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

కులగణన సర్వేలో బీసీలు మైనారిటీలతో కలుపుకుని 56.33 శాతం ఉన్నట్లు సబ్‌కమిటీ నివేదికలో పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం పథకాలు, రిజర్వేషన్ల అమలు చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేయనుంది. దీని కోసం న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా రిజర్వేషన్లు అమలు చేయడానికి రేవంత్ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి బీసీల కోటా 40 శాతం పెంచుతామని చెప్పారు. దానికి అనుగుణంగానే 50 రోజుల పాటు కులగణన సర్వే చేయించారు. మొత్తం లక్షా 3,889 మంది అధికారులు సర్వే చేశారు. తెలంగాణలో 96.9శాతం కుటుంబాలు ఉన్నట్లు నివేదికలో తేల్చారు. ఈ సర్వేలో 3 కోట్ల 54 లక్షల మంది తమ వివరాలు నమోదు చేసుకున్నారు. 3.1శాతం సర్వేలో వివరాలు నమోదు చేయించుకోలేదని నివేదికలో కమిటీ తెలిపింది. అసెంబ్లీలో కులగణనపై చర్చించిన తదుపరి సభ ఆమోదం తెలపనుంది.

**15లోగా పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్**

మరోవైపు ఈనెల 15లోగా గ్రామపంచాయతీ, మండల. జిల్లా పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఈ విషయం ప్రకటించారు. పంచాయతీ ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలని కోరారు.

## ఎమ్మెల్యేల భేటీ నిజమే

(మొదటి పేజీ తరువాయి)

అని ప్రశ్నించారు. తాను ఏ ఫైల్ కూడా రెవెన్యూ మంత్రి దగ్గర పెట్టలేదన్నారు. సీఎం రేవంత్, దీపాదాస్ మున్షీని కలిశాక పూర్తి వివరాలు చెబుతానని అన్నారు. ఎమ్మెల్యేలు భేటీ అయిన మాట నిజమే, నేను ఏ ఫైల్‌ను రెవెన్యూ మంత్రి దగ్గర పెట్టలేదు, అసలు అది ఏ ఫైల్ అనేది ఎంపీ మల్లు రవి చెప్పాలన్నారు. మేమేం రహస్యంగా సమావేశం కాలేదు, అధిష్టానికి చెప్పాల్సింది చాలానే ఉంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కలిశాక అన్ని విషయాలు మాట్లాడుతా అన్ని వివరాలు చెబుతా. నా క్యారెక్టర్‌ను తప్పుగా చూపిస్తే ఊరుకునేదే లేదు. ఎవరి చరిత్ర ఏంటో అందరికీ తెలిసిందే. అన్ని ఆధారాలతో పెద్దలతో మాట్లాడుతా' అని అనిరుధ్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. ఇదిలా ఉండగా..



కాంగ్రెస్ ఎమ్మెల్యేల రహస్య భేటీ వార్తలపై ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా స్పందిస్తున్నారు. తాము ఏ రహస్య సమావేశంలోనూ పాల్గొనలేదని వరంగల్ ఈస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వెల్లడించారు. ఉద్దేశపూర్వకంగా కొందరు కావాలనే ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారన్నారు. తనపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై పరువు నష్టం దావా వేయనున్నట్లు రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌ను కలిసి ఈ అంశంపై ఫిర్యాదు చేస్తానన్నారు.

# భువనేశ్వరి, బాలయ్య మధ్య నలిగిపోతున్నాను

## ఏపీ సీఎం చంద్రబాబు చమత్కారం.. బాలకృష్ణకు పద్మభూషణ్

### తన ఫాంహౌస్ లో ఫ్యామిలీ పార్టీ ఏర్పాటు చేసిన నారా భువనేశ్వరి

### హాజరైన చంద్రబాబు.. ఆద్యంతం ఉల్లాసంగా కార్యక్రమం



**మహా :** నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పద్మభూషణ్ ప్రకటించిన నేపథ్యంలో, తన అన్నయ్య బాలకృష్ణ గౌరవార్థం సొంత ఫాంహౌస్ లో నారా భువనేశ్వరి గ్రాండ్ గా పార్టీ ఏర్పాటు చేశారు. ఈ కుటుంబ వేడుకకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి, నారా, నందమూరి కుటుంబ సభ్యులు హాజరైన ఈ ఫ్యామిలీ పార్టీ ఆద్యంతం ఉల్లాసంగా సాగింది. ఈ సందర్భంగ చంద్రబాబు తన చమత్కారాలతో అందరినీ నవ్వించారు. నారా భువనేశ్వరి కూడా చంద్రబాబుతో కొన్ని సరదా వ్యాఖ్యలు చేయడం ఈ కార్యక్రమంలో నవ్వులు పూయించింది.

నారా భువనేశ్వరి తన భర్త చంద్రబాబుకు వేదికపై మైక్ అందిస్తూ ఏమండీ ఒకసారి ఇలా రండి బాలా గురించి కొన్ని మాటాలు మాట్లాడండి అంటూనే ఐదు నిమిషాల్లో స్పీచ్ అయిపోవాలి ఇదేమీ రాజకీయ ప్రసంగం కాదు గంటలు గంటలు మాట్లాడొద్దు అని అన్నారు. తన అర్ధాంగి మాటలకు నవ్వుతూనే మైక్ అందుకున్న చంద్రబాబు అన్నాచెల్లెళ్లను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఇది నిజంగా అద్భుతమైన సాయంత్రం. ఒకవైపున బాలయ్య మరోవైపు అంతే పవర్ ఫుల్ అయిన భువ (భువనేశ్వరి) ఇద్దరి మధ్యన నేను నలిగిపోతున్నా వీళ్లిద్దరి మధ్యన ఉంటే చాలా ప్రమాదం! ఈ ఫ్యామిలీ పార్టీ గురించి కూడా నాకేమీ తెలియదు 'నేనేం చేస్తానో మీకు ఎవరికీ చెప్పను నా అన్నయ్యకి నేను చేయబోయే కార్యక్రమం నా అభిమానంతో చేస్తున్నాను ఇందులో మీకెవరికీ ప్రమేయం లేదు ఇది నా అభిమతం' అని చెప్పి భువనేశ్వరి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసింది" అని చంద్రబాబు వివరించారు.

ఇక, తన బావమరిది బాలకృష్ణను చంద్రబాబు ఈ సందర్భంగా పొగడ్తల్లో ముంచెత్తారు. నిన్నటిదాకా అల్లరి బాలయ్య, ఇప్పుడు పద్మభూషణుడు, ఎన్టీఆర్ ను గుర్తు పెట్టుకునేలా బాలయ్య నడుచుకుంటున్నారు, అందుకు నేను గర్విస్తున్నాను, బాలయ్య అన్ స్టాపబుల్ కెరీర్ లో ఇదొక మైలురాయి, ఆయనకు పద్మభూషణ్ రావడం మా కుటుంబానికి గర్వకారణం, మా కుటుంబంలో ఇంతపెద్ద అవార్డు రావడం ఇదే ప్రథమం, మా కుటుంబం అంతా ఎంతో ఆనందిస్తోందన్నారు. కెరీర్ పరంగా చూస్తే బాలయ్య నాకంటే సీనియర్, ఆయన 1974లో తొలి సినిమా చేస్తే, నేను 1978లో తొలిసారి ఎమ్మెల్యే అయ్యాను. బాలకృష్ణ పైకి అల్లరిగా కనిపించినా, లోపల డెప్త్ ఉంది, ఒక డెడికేషన్ ఉంది. గొప్ప మానవతా దృక్పథం ఉన్న వ్యక్తి. క్యాన్సర్ ఆసుపత్రిని అద్భుతంగా తీర్చిదిద్దారు. బాలయ్య టేకోవర్ చేసిన తర్వాత క్యాన్సర్ ఆసుపత్రి దేశంలోనే అగ్రగామి ఆసుపత్రుల్లో ఒకటిగా పేరుతెచ్చుకుంది. అందుకు నేనెంతో గర్విస్తున్నాను అని అన్నారు. ముచ్చటగా మూడు సార్లు హిందూపురంలో ఎమ్మెల్యేగా గెలిచిన బాలయ్య అప్పుడప్పుడు ఆయన అర్ధాంగి వసుంధరకు టికెట్ ఇవ్వమని అడుగుతుంటాడు. మరి కావాలనే ఆ విధంగా అడుగుతాడో, లేక ఆమెను మెప్పించడానికి అడుగుతాడో అర్థం కాదుఅంటూ చంద్రబాబు నవ్వులు పూయించారు.



# ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు రద్దుచేయాలి

**వరంగల్, మహా:** ఈడబ్ల్యుఎస్ రిర్వేషన్లను వెంటనే రద్దుచేయాలని, దీనివల్ల బిసిలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. వరంగల్ వేదికగా జరిగిన బిసి యుద్ధభేరి సభలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగాలు, రాజకీయాల్లో బిసిలు అణచివేతకు గురవుతున్నారన్నారు. బిసిలంతా కలిసికట్టుగా మరో ఉద్యమానికి సిద్ధం కావాలని, వచ్చే సారి బిసినే ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలన్నారు. కులగణనలో బిసిలు 56శాతం లెక్క తేల్చారని, 2కోట్ల మంది బిసిలు తలుచుకుంటే ఈ రాష్ట్రంలో ఏమైనా చేయొచ్చన్నారు. నాలుగేళ్ళలో బిసిల కాళ్ళదగ్గరకు రాష్ట్రం తెస్తమన్నారు. సభకు వివిధ జిల్లాల నుండి భారీగా హాజరుకాగా, ఎంపీ ఆర్. క్రిష్ణయ్య, మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు, వకుళాభరణం క్రిష్ణమోహన్, పూల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# 27 జిల్లాలకు బీజేపీ అధ్యక్షుల ఖరారు

## జాబితా విడుదలే ఆలస్యం

(మొదటి పేజీ తరువాయి)

స్వీకరించారు. దీంతో మొత్తం 27 జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించే అవకాశం ఉంది.

1. హైదరాబాద్ జిల్లా - లంకల దీపక్ రెడ్డి
2. భువనగిరి - అశోక్ గౌడ్
3. జనగామ - సౌడా రమేశ్
4. నల్గొండ - వార్షిత్ రెడ్డి
5. మేడ్చల్ - బి. శ్రీనివాస్
6. సిద్ధిపేట - జి. మోహన్ రెడ్డి
7. గోల్కొండ - ఉమామహేందర్
8. హన్మకొండ - సతీష్ రెడ్డి
9. భాగ్యనగర్ - శేఖర్ చంద్ర
10. సికింద్రాబాద్ - భారత్ గౌడ్
11. నిజామాబాద్ - దినేష్ కులాచారి
12. జగిత్యాల - యాదగిరి
13. వరంగల్ - గంట రవి..
14. మహబూబ్ నగర్ - శ్రీనివాస్
15. వనపర్తి - నారాయణ
16. భూపాలపల్లి - నిషిదర్ రెడ్డి
17. ఖమ్మం - రవికుమార్
18. మహబూబాబాద్ - వెంకటేశ్వర్లు
19. ములుగు - బలరాం
20. మెదక్ - మహేశ్ గౌడ్
21. కామారెడ్డి - రాజు
22. సంగారెడ్డి గోదావరి అంజిరెడ్డి
23. పెద్దపల్లి - సోమరము లావణ్య
24. అసిఫాబాద్ - శ్రీశైలం
25. మంచిర్యాల - వెంకటేశ్వర్లు గౌడ్

# జనగణన ఇంకెప్పుడు చేస్తారు..?

- కేంద్రాన్ని నిలదీసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- కులగణన నివేదిక నేపథ్యంలో జాగృతి నేతలతో భేటీ

**హైదరాబాద్, మహా:** జనగణనను కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. జనాభా లెక్కలు లేకుండా ప్రగతి ఎలా సాధ్యమవుతుంది..? అని ప్రశ్నించారు. జనాభా లెక్కలు లేమితో వృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. జనాభా లెక్కలు లేకుండా దేశ సామాజిక, ఆర్థిక పరిస్థితి ఎలా తెలుస్తుంది..? అని అడిగారు. ప్రగతిశీల విధానాలకు జనాభా లెక్కలు తప్పనిసరి ఆమె పేర్కొన్నారు. జనగణనపై కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. మరోవైపు కులగణన లెక్కలు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో తెలంగాణ జాగృతి నేతలతో ఆమె సమావేశమై చర్చించారు.



# అద్భుతం.. అపురూపం

- 5000 మందితో సూర్య నమస్కారాల కార్యక్రమం
- ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాం
- ప్రజలు ఉత్సవాల్లో స్వచ్ఛందంగా పాల్గొనాలి

## ఎమ్మెల్యే గొండు శంకర్

**శ్రీకాకుళం జిల్లా, మహా:** అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి రథసప్తమి ఉత్సవాలను పురస్కరించుకొని 80 అడుగుల రోడ్డులో నిర్వహించిన సూర్య నమస్కార కార్యక్రమం అద్భుతం... అపురూపమని ఎమ్మెల్యే గుండు శంకర్ కొనియాడారు. రథసప్తమి సందర్భంగా ఆదివారం ఉదయం 80 వ రోడ్లు సూర్య నమస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ విలేకరులతో మాట్లాడుతూ రథసప్తమిని రాష్ట్ర పండుగ చంద్రబాబు నాయుడు అంగీకరించడం గొప్ప విషయం అన్నారు. వెంటనే ఉత్సవాలను రాష్ట్ర పండుగగా అధికారికంగా ఉత్తర్వులు తీసుకు రావడంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చం నాయుడుల కృషి మరువలేనిది అన్నారు. రథసప్తమి ఉత్సవాల సందర్భంగా హెలికాప్టర్ టూరిజంను కూడా ప్రారంభిస్తామని చెప్పారు. మూడు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించుకునే ఈ ఉత్సవాల్లో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సూర్య నమస్కారాల కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులకు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు, ప్రజలకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చం నాయుడులు ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారని వారి ఆదేశాల మేరకు అన్ని కార్యక్రమాలు పూర్తి చేసినట్లు వివరించారు.



# అంగరంగ వైభవంగా రథసప్తమి శోభాయాత్ర

## ఉట్టిపడేలా సంస్కృతి సంప్రదాయాలు.. వేలాదిగా భక్తుల హాజరు




**శ్రీకాకుళం జిల్లా, మహా:** నగరంలో రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల వేడుకలలో శోభాయమానంగా ఏర్పాటు చేసిన శోభాయాత్ర వేలాది మంది భక్తులు నడుమ దిగ్విజయంగా సాగింది. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శోభాయాత్ర కాలేజీ రోడ్డు నుండి ప్రారంభమై డే అండ్ నైట్ జంక్షన్, కృష్ణా పార్క్, సెవెన్ రోడ్ జంక్షన్, సూర్య మహల్ జంక్షన్, ప్రభుత్వ మహిళా కళాశాల మీదుగా అరసవిల్లి ప్రధాన ఆలయం వరకు సాగింది. ఈ శోభాయాత్రలో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కోలాటం, తప్పెటగుళ్ళు, దింసా, కోయ నృత్యం, కొమ్ము నృత్యం, బిందెల డాన్స్ వంటి ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. వందమంది మహిళలతో కలశ యాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రధాన కోడళ్ళలో బాణాసంచా వెలుగులు విరజిమ్మాయి. వివిధ దేవస్థానాల శోభాయాత్రలు కూడా ఈ వేడుకలో పాల్గొన్నాయి. విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి, చిత్తూరు జిల్లా ఐరాల మండలం కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక, అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి, ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీశ్రీశ్రీ పైడితల్లి అమ్మవారి దేవస్థానం, విజయనగరం జిల్లా రామతీర్థం శ్రీ రామస్వామి దేవస్థానాల శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో సంప్రదాయం డైరెక్టర్ స్వాతి సోమనాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

# తెలంగాణకు ఎవరేం చేశారో చర్చకు సిద్ధమా..?

## చర్చకు రావాలంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బీజేపీ సవాల్

### కళ్ళుండి చూడలేని కబోదులు బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు


### తీవ్ర స్థాయిలో మండిపడ్డ బీజేపీ నేత లక్ష్మణ్



**మహా :** వికసిత భారత్ 2047 విజన్ లక్ష్యంగానే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్ ను రూపొందించి ప్రవేశపెట్టారని బీజేపీ ఎంపీ, ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ తెలిపారు. బడ్జెట్ లో తెలంగాణకు నిధులేమీ ఇవ్వలేదంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. తెలంగాణలో మూడు ప్రపంచ స్థాయి రైల్వే స్టేషన్లను ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ట్రిబుల్ ఆర్ కు కేంద్రమే నిధులిస్తుందన్నారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని కేంద్ర నిధుల ద్వారానే పునరుద్ధరించడం జరిగిందని పేర్కొన్నారు. కరోనా లాంటి గడ్డు పరిస్థితి తర్వాత నరేంద్ర మోడీ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుని దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం జరిగిందన్నారు. 2014 లో 2 లక్షలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటే ఇప్పుడు దాన్ని ఏకంగా 12 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. ఇదొక మైలు రాయి అని, దశాబ్ధకాలంలో మోడీ ఎన్నో కీలక నిర్ణయాలను తీసుకున్నారన్నారు. మధ్య తరగతి ప్రజలతోనే దేశ ఆర్థిక పరిస్థితి సాధ్యమని గుర్తించిన నరేంద్ర మోడీ ఈ నిర్ణయం తీసుకున్నారని, రాష్ట్రాల హక్కులకు ప్రాధాన్యం కల్పిస్తూనే చారిత్రాకత్మకమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. సామాన్యుడికి కూడా నాణ్యమైన విద్య, వైద్యం అందుకునేలా వ్యవస్థను తీర్చి దిద్దారని పేర్కొన్నారు. ఇవన్నీ గుర్తించని ప్రతిపక్ష పార్టీలు కళ్ళులేని కబోదుల్లా మారి విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. నెహ్రూ నుంచి ఇందిరాగాంధీ వరకు తెలంగాణలోని మెదక్ ను కాంగ్రెస్ కు కంచుకోట అని చెప్పుకున్నారని, దాదాపు 70 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పటికీ మెదక్ కు రైలు మార్గం వేయలేకపోయారని విరుచుకుపడ్డారు. నరేంద్ర మోడీ అధికారంలోకి రాగానే మెదక్ కు రైలు మార్గం వేయడంతో పాటు రైలును నడిపిస్తున్నామన్నారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం జరిగిందంటూ ధర్నాలు, ఆందోళనలు చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు ఎవరి హయాంలో ఏం చేశారో, ఎంత అభివృద్ధి జరిగిందో చర్చించేందుకు సిద్దమా అని సవాల్ విసిరారు.

# మహాకుంభ్‌లో 34 కోట్ల మంది పవిత్ర స్నానాలు

**అయోధ్య:** ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్ మేళా లో ఇప్పటి వరకూ 34 కోట్ల మంది త్రివేణి సంగమ స్నానాలు చేశారని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. మిల్కిపూర్ అసెంబ్లీ నియోజవర్గంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, ఏళ్ల తరువాత రామ్‌లల్లా ప్రతిష్ఠాపన జరిగినప్పుడు సమాజ్‌వాదీ పార్టీ వ్యతిరేకించిందని, అయోధ్య అంతర్జాతీయ విమానాశ్రయానికి మహర్షి వాల్మీకి పేరు పెట్టడాన్ని వ్యతిరేకించిందని, గత రెండు నెలలుగా ఆ పార్టీ చీఫ్ మహాకుంభ్‌కు వ్యతిరేకంగా టీట్లు చేస్తూనే ఉన్నారని అన్నారు. ఈరోజు వరకూ 34 కోట్ల మంది భక్తులు త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు చేశారని చెప్పారు.



# కాంగ్రెస్‌లోకి సంజయ్ రౌత్..?

- మహారాష్ట్ర పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ
- అవునంటున్న బీజేపీ నేత నితీష్ రాణే

**ముంబై, మహా :** శివసేన సీనియర్ నేత, ఆ పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ పార్టీని వీడనున్నారా? కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారా? మహారాష్ట్ర పొలిటికల్ సర్కిల్స్ లో దీనిపై చర్చ జరుగుతోంది. మహారాష్ట్ర మంత్రి, బీజేపీ నేత నితీష్ రాణే దీనికి 'అవుననే' చెబుతున్నారు. కాంగ్రెస్‌లోకి చేరేందుకు ఢిల్లీలోని ఒక నేతతో సంజయ్ రౌత్ సంప్రదింపులు జరుపుతున్నారని ఆయన ఆదివారంనాడు తెలిపారు.

# అమెరికా సంగతి చూస్తాం

## చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ సంచలన ప్రకటన

### పన్నుల బాదుడుపై రుసరుస



**మహా:** చైనాపై సుంకాలు విధించాలన్న అమెరికా అధ్యక్షుడి ట్రంప్ నిర్ణయంపై చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ మండిపడింది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)లో వాషింగ్టన్ నిర్ణయాన్ని సవాలు చేస్తామని ఆ శాఖ ఆదివారం ప్రకటించింది. కెనడా, మెక్సికోపై 25 శాతం, చైనాపై 10 శాతం సుంకాలు విధిస్తూ ట్రంప్ శనివారం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ సుంకాలు మంగళవారం నుంచి అమల్లోకి రానున్నాయి. దీనిపై చైనా స్పందిస్తూ అమెరికా నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొంది. దేశ ప్రయోజనాలు, హక్కులను కాపాడుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ''అమెరికా తప్పుడు పద్ధతులు అనుసరిస్తోంది. దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాం. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఈ చర్యలతో అమెరికా సమస్యలు తీరకపోగా.. సాధారణ ఆర్థిక వ్యవస్థ, వాణిజ్య సహకారాలు దెబ్బతింటాయి. ఈ విషయాన్ని సహేతుక దృష్టితో వాషింగ్టన్ చూడాలి. ఇతర దేశాలను సుంకాలతో ప్రతిసారి బెదిరించకుండా.. తన దేశంలో ఫెంటనిల్ వంటి సమస్యలను సొంతగా పరిష్కరించుకోవాలి. తప్పుడు పద్ధతులను సరిచేసుకోవాలని అమెరికాను కోరుతున్నాం'' అని చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో కోరింది.

# కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

- ఎన్డీయే భాగస్వాములుగా చంద్రబాబు,పవన్ సాధించిందేమిటి?
- పోలవరం ప్రాజెక్టు లక్ష్యం దెబ్బతింటున్నా కూటమి నాయకులకు పట్టదా?
- వ్యవసారంగానికి ఊతమిచ్చే ప్రకటన ఏది?
- బీహార్‌ను స్ఫూర్తిగా తీసుకుని కేంద్రంపై ఒడ్తిడి తీసుకురండి
- మాజీ ఎంపీ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, మహా:** కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని మాజీ ఎంపీ, వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా ఎలాంటి ప్రకటన చేయకపోవడం బాధాకరమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కు జీవనాడిగా ఉన్న పోలవరం ప్రాజెక్టును 41.15 మీటర్ల వరకు నీరు నిలిపేలా నిర్మాణం చేయనున్నట్లు కేంద్రం స్పష్టం చేసినా కూటమి నాయకులు మాట్లాడకపోవడం దారుణమన్నారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడడానికి ఏపీ, బీహార్ ఎంపీలే కీలకమని పేర్కొన్నారు. ఇలాంటి తరుణంలో బీహార్‌కు ఒకలా.. ఆంధ్రప్రదేశ్‌కు ఒకలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని తెలిపారు. ఏపీకి కొత్త ప్రాజెక్టులు సాధించుకోవడంలో సీఎం చంద్రబాబు వైఫల్యం చెందారని అన్నారు. బీహార్‌లో నితీష్‌కుమార్ సారథ్యంలోని జేడీయూ, బీజేపీ భాగస్వామ్య ప్రభుత్వం ఉందన్నారు. ఈ ఏడాదిలోనే అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీహార్‌కు కేంద్ర బడ్జెట్‌లో వరాలు కురిపించారని పేర్కొన్నారు. ఎన్డీయే భాగస్వాములుగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు సాధించింది ఏమిటో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ఇప్పటికైనా బీహార్‌ను స్ఫూర్తిగా తీసుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి ఏపీ ప్రయోజనాలు కాపాడాలని సూచించారు.

# ముద్రగడ ఇంటిపై దాడి చేసిన వ్యక్తి..

## పిఠాపురం ఎమ్మెల్యే తాలుకా అంట.. అంబటి రాంబాబు ఫైర్

**మహా:** వైసీపీ నేత ముద్రగడ పద్మనాభ రెడ్డి ఇంటిపై జనసేన కార్యకర్త దాడి ఘటనపై మాజీ మంత్రి అంబటి రాంబాబు స్పందించారు. ముద్రగడ ఇంటిపై దాడి చేసిన వ్యక్తిని అడిగితే.. నేను పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా అని చెప్పుకుంటున్నాడని తెలిపారు. దీంతో దాడి చేసిన వ్యక్తి జనసేన కార్యకర్త అని స్పష్టమైందని అన్నారు. ఇలాంటి దౌర్జన్యాలను డిప్యూటీ సీఎం ప్రోత్సహించడం సమంజసం కాదని అంబటి రాంబాబు అన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నోరు మెదపాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఖండించకపోతే ప్రజాస్వామ్యంలో దౌర్జన్యాలను ప్రోత్సహించినవారమవుతారని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు. ఈ ఘటనకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలని.. దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని నూతనంగా వచ్చిన డీజీపీ కూడా కోరుతున్నానని చెప్పారు.

**పవన్ కల్యాణ్ దాడులకు వ్యతిరేకం : ముద్రగడ కుమార్తె**

మరోవైపు ముద్రగడ నివాసంపై జరిగిన దాడిని ఆయన కుమార్తె, జనసేన నాయకురాలు బార్లపూడి క్రాంతి తీవ్రంగా ఖండించారు. నాన్నగారి ఇంటిపై దాడి జరిగిందని తెలిసి చాలా బాధపడ్డానని అన్నారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎటువంటి దాడులకు అయినా వ్యతిరేకమే అని స్పష్టం చేశారు. దాడి వెనుక ఎంత పెద్దవారున్నా.. బయటి తీసి చర్యలు తీసకుంటామని హామీ ఇచ్చారు. మతిస్థిమితం లేని వ్యక్తి ఈ దాడికి పాల్పడి ఉంటాడని అనుమానంగా ఉందని అన్నారు.

LITERATURE
సాహిత్యం

# ఇది మృదువైన నవాబీ మైకం



- రాజా హైదరాబాదీ,
9392302245

ఆ గల్లీల్లో మెరిసే వర్షం
ఆ ఛత్రీలు తెరుచు కునే అందం
ఆ రిక్షాల చక్రాల్లో తిరిగే నాదం

ఆ నలుపూ, తెలుపూ దృశ్యాన్ని
మళ్ళీ ఎవరు చూపిస్తారు ?
ఆ హోటల్లో మారు మోగే
"నూర్జాహాన్" రాగం

ఆ "పౌనా" మీద లేచే
పురాతన పొగల హొయల పరిమళం
ఆ పాన్ లో "మజా" లేపే
తిమ్మిరి తిమ్మిరి "నవాబీ" మైకం

ఈ చినుకుల్లో తడుచు కొంటూ,
అంత దూరం ఎవరు తీసు కెళు తారు !?

నడిచి పోతే తడి తడి ఆనందం
తుడుచు కుంటే రాలిపోని,

పూల రేకుల సుగంధం
ఫుట్ పాత్ లు పూల తోటలు,
జనాలు,మిల మిలల పగటి నెల వంకలు

అబిడ్స్ షాపులన్నీ,
కాటుక కళ్ళ సోయగాలు

వెనక వెనక వెళ్ళి,
భుజం మీద చేయి వేయడానికి
ఆగిపోయి చూసే,
అప్పటి కాలం ఇప్పుడెక్కడుందీ ?
"మ్యాట్నీకి" టికెట్ దొరకడం
ఎండ తడిసి నంత మెత్తని సంబరం !

"ఇంటర్వెల్" లో, కర్చీఫ్ దులిపితే
సిగ్గుతో చిట్లే వాన వాసనల చిలిపితనం

ఎన్నెన్ని రంగులతో హైదరాబాదంతా
ఆరని పెయింటింగులా వుంది

మళ్ళీ ఎప్పుడు దొరుకు తుంది,
నలిగిపోని ఆ మనుషుల నిండుదనం ?
దూరందాకా, వెనకంతా మసక మసగ్గా వుంది

గుంపు వెళ్ళిపోయి నట్టూ,
దుమ్ము లేస్తున్నట్టూ,
లీలగా చార్మినార్ కనిపిస్తుంది !
ఏదీ నా గండిపేట్ సాగర తీరం
ఎక్కడా కోఠి నుండి బయలు దేరే
"వన్ ట్వెంటీ" నెంబర్ బస్ విహారం
ఏరీ మధు బాలను గుర్తు చేసి వెంటబడే
"బర్సాత్ కి రాత్" పాటలు పాడే మిత్రులు !?

ఆవలి తీరానా ఎవరో 'షాయర్'
అటువైపు తిరిగి నడిచి పోతున్నాడు
అలలకు భాష నేర్పిన వాడు
ఏదీ ఆశించకుండా,
ఈ మనుషుల ప్రేమను

తడి ఆరకుండా చూస్తున్నాడు !
ఈ నగరంలో కురిసే ముసురు
నుమాయిష్ లో వెలిగే వెన్నెల లాంటిది
ఇప్పుడు ఆ గేటు దగ్గరకు వెళితే
"గీత్ గాయా పత్త రోనే" హీరోయిన్
రాజశ్రీ లాంటి అమ్మాయి
ఇంకా అక్కడే ఎదురు చూస్తుంటుందా !?

ఏమో ఎవరో "జూలాల" మీద తిరుగుతుంటే
సరిగా కనిపించటం లేదు
అంత దూరం ఎవరు తోడుగా వస్తారు !?
ఈ వర్షానికి బాల్యమంతా,
పరిమళం పరిమళంగా తడిసి పోయింది

ఏంటో !
ఈ "ఢిల్లీ దర్బార్" హోటల్ పెద్ద మనిషికి,
రాత్రి లేదు,పగలూ లేదు
ఎప్పుడూ ,
ఆ "పాయల్ కీ ఝుంకార్ రస్తే రస్తే !

దూండే తేరా ప్యార్ రస్తే రస్తే !"

ఘల్లు మనే ఆ పాటనే వేస్తుంటాడు
ఆ సంగీత ప్రేమికుడికీ, ఈ వర్షంలో,
నేను తిరుగుతున్నా నని తెలుసేమో !?

ఇప్పుడు అచ్చంగా,
తడిసిన,నెమలి పింఛంలా వుంది,
ఛత్రీ దానం చేసే,ఈ హైదరాబాద్ !

నా పూర్వులు వెలిగించిన
ఈ దీపాలు ఆరిపోవద్దు !
పాలకులు వస్తారు పోతారు
స్వప్నం చెదిరి పోవద్దు !
చూడూ బుగ్గపగిలి పోతే
దీపం ఆరి పోతుంది జాగ్రత్త !


కాపాడు కోవాలి !
మన అద్దాన్ని మనం తుడుచు కోవాలి

హైదరాబాద్ వర్షంలో తడుస్తుంటే,
చందమామ స్నానం చేస్తున్నట్టుండాలి !
ముసురు పడుతూనే వుంది
మీనా కుమారి గజల్ లా
నీళ్ళు మంద్రంగా
రోడ్ల మీద పారుతూనే వున్నాయి

రిక్షా కోసం ఎదురు చూస్తున్నాను
జేబులో డబ్బులున్నయో లేవో !?
నన్ను గుర్తుపట్టే రిక్షావాళ్ళు
ఇప్పుడున్నారో లేరో!?
పూర్తిగా తడిసి పోయాను
ఈ చినుకులు ఆగేదాకా
ఆ సినిమా టాకీస్ ముందు నిలుచుంటాను !

# పాత బంగారం

## తరంగాలు - మాదిరెడ్డి సులోచన






- జ్యోతి మనోగ్న, హైదరాబాద్
98853 84740

స్త్రీవాదం ప్రాచుర్యంలోకి వచ్చాక చదివిన పుస్తకాలు ట్రెండెస్టెర్మనకు గుర్తిండిపోయాయి. కాని స్త్రీవాదం గురించి పెద్దగా చర్చలేని రోజుల్లో అద్భుతమైన చర్చకు తెరతీయగల కొన్ని మంచి నవలలు వచ్చాయి, పాఠకులను కదిలించాయి, స్త్రీవాదం పేరుతో ఆతరువాత వచ్చిన ఎన్నో నవలల కన్నా ఎంతో స్పష్టతతో, అవగాహనతో స్త్రీల సమస్యలను, జీవితాలను చర్చించిన ఈ నవలలను ఇప్పుడు చదువుతుంటే ఆ రచయిత్రులపై ఎంతో ప్రేమ కలుగుతుంది. ఎందుకంటే ఆరోజుల్లో కేవలం స్త్రీల పక్షాణ నిలబడి రాయడం నిజంగా పెద్ద సాహసమే. "తరంగాలు" అనే ఈ నవల ఇపుడు చదివి నా మాదిరెడ్డి సులోచన గారిని అభిమానించకుండా ఉండలేం. నేను చిన్నప్పుడెప్పుడో వీరివి నవలలు కొన్ని చదివాను కాని అవి పేర్లు కూడా గుర్తుకులేవు. ఇప్పుడు రీప్రింట్ అయివచ్చిన ఈనవలను ఆపాత పరిచయం తోనే మళ్ళి చదివితే ఎంతో తృప్తిగా అనిపించింది. వివాహవ్యవస్థను, ఆవ్యవస్థలో నలిగిపోతున్న స్త్రీ జీవితాన్ని ఎంతో విమర్శనాత్మక దృష్టితో చర్చకు పెట్టిన నవల ఇది. కాని స్త్రీవాద సాహిత్యం గురించి చర్చించిన ఏసందర్భంలోనూ ఎవరూ దీన్ని కోట్చేయరు. అంటే చాలామందికి ఈపుస్తకం గురించి తెలియదేమో అనిపించింది. దిగువ మధ్యతరగతి కుటుంబంలో ఆఖరి సంతానంగా జన్మిస్తుంది జ్ఞాన. ఆమెను అపురూపంగా చూసుకుంటారు అందరు. పెద్దన్న అతి మంచివాడు భాద్యతఎరిగిన వ్యక్తి. ఆయన భార్య కూడా అటువంటిదే. మిగతా తమ్ముళ్ళు తమ స్వార్ధం చూసుకుని వెళ్ళిపోయినా అన్నమాత్రం తన భాద్యతలు మరువక పెద్దకొడుకుగా అందరికీ చేదోడు వాదోడుగా ఉంటూ ఎన్నో త్యాగాలు చేస్తాడు. జ్ఞాన బాగా చదువుతుందని తెలుసుకుని ఆమెని మెడిసిన్చేయిస్తాడు. పుట్టింట్లో ఆస్తులు లేకపోయినా రాణిలా పెరుగుతుంది జ్ఞాన.

జ్ఞాన వివాహం శేఖర్తో జరుగుతుంది. వీరికి ఇద్దరు పిల్లలు. పిల్లల బాధ్యత, ఉద్యోగ భాధ్యతకు తోడు ఇంటి చాకిరి అత్తగారి తరుపు చుట్టాల దాడి, ఆకుటుంబంలోని భిన్న వ్యక్తులకు చేసే కోడరికం, ఇవన్నీ ఆమెని నలిపేస్తూ ఉంటాయి. శేఖర్ మంచివాడే కాని ఇంటి భాద్యతలను పంచుకోవాలని అనుకోడు. అవన్నీస్త్రీల భాద్యతలని కొట్టిపడేస్తాడు. వివాహం చేసుకోబోయే ముందు కట్నంలాంటి విషయాలను పట్టించుకోకుండా భార్య తరుపు కుటుంబానికి గౌరవం ఇస్తూ భార్యను తన జీవితంలోకి ఆహ్వానించిన ఆధునిక యువకుడు శేఖర్. కానీ బాధ్యతలు పెరుగుతున్నప్పుడు భార్యపై అన్నీ వదిలేసి తన ప్రైవసి, అవసరాలకు ఎక్కడా రాజీపడకుండా భార్య అన్నీ సంభాలించుకుని తనకు నొప్పితో గలకుండా జీవించాలని కోరుకునే మగాడు శేఖర్. సంసార బాధ్యతల నడుమ నలిగిపోతూ ప్రేమించిన పుట్టింటి వారిని కలుసుకునే సమయం కూడా లేక, అత్తింటి రాజకీయాలతో అలసిపోతూ ఉంటుంది జ్ఞాన. పైగా ఏచిన్న తప్పు జరిగి నా ఆమెకు చదువుకుందన్న అహంకారం అనే మాట అందరూ ఉపయోగిస్తూ ఉంటారు. దీనితో అందరికీ మంచి చేయాలని తపిస్తూ, పరిగెత్తుతూ అలసిపోతూ ఉంటుంది జ్ఞాన. శేఖర్ ఆమె అలసటని గుర్తించడు. పైగా ఆమెపై ఇంటి విషయాలలో ఇంకా ఒత్తిడి తెస్తూ ఉంటాడు. రచయిత్రి నవలను జ్ఞాన సంసార బాధ్యతల నుండి మొదలుపెట్టి ఆ ఒత్తిడి నడుమ తన గతాన్ని ఆమె గుర్తుకు తెచ్చుకుంటూ సంసారంఅనే ఊబిలో తానొక యంత్రంగా మారి విధానాన్ని నెమరు వేసుకుంటూ ఉండే విధంగా రాసారు. ఈ శైలితో ఆమె చెప్పాలనుకునే విషయాన్ని సూటిగా ప్రస్తావిస్తారు. వివాహంతో పురుషుని జీవితం కన్నా స్త్రీ జీవితంలో వచ్చే మార్పు ఎంత ఒత్తిడిని తీసుకుని వస్తుందో జ్ఞాన, శేఖర్ల సంసారాన్ని ఆమె వర్ణిస్తూ కథ నడిపిన తీరులో స్పష్టంగా చెప్తారు.

భర్త నుండి ఏ సహాయమూ లేక అతని కుటుంబీకుల రాజకీయాలను తట్టుకోలేక జ్ఞాన కొన్నిరోజులు భర్తకు దూరంగా ఉండవలసివస్తుంది. ఆ సమయంలో శేఖర్కు ఆ ఇంట జ్ఞాన పాత్ర పూర్తిగా అర్ధం అవుతుంది. తమ బాధ్యతలను గుర్తించి భార్యభర్తలిద్దరూ చివరలో కలవడం నవల ముగింపు. సులోచన గారు ఈ నవలలో ఉద్యోగస్తురాలయిన స్త్రీ జీవితంలో వివాహంతో వచ్చే మార్పులను ప్రస్తావిస్తూ దాని ద్వారా ఆమెలో పెరిగే ఒత్తిడి, అసహనం, రెండు రంగాలలో సమానంగా శ్రద్ధ చూపడం కోసం ఆమె నలిగిపోయె విధానాన్ని చాలా సున్నితంగా ప్రస్తావిస్తారు. ఇందులో ఆమెపురుష సమాజాన్ని దూషించరు. కేవలం స్త్రీల మనసుకు దగ్గర అవడానికి, ఆమె కష్టాన్ని అర్ధం చేసుకోవడానికి ప్రయత్నించని వారి స్వభావాన్ని మార్చుకుంటే వా రిజీవితాలు ఎంత ఆనందంగా సాగుతాయో చెప్పే ప్రయత్నం చేసారు. అందుకే ఈ నవలకు ఓ పరిపూర్ణత వచ్చింది. ఈ నవల రాసి అరవై సంవత్సరాలు అయిందట. అయినా ఇప్పటి నవలగా అనిపిస్తూ ఎక్కడా పాత నవల ఛాయలు లేకుండా ఉండడానికి కారణం ఈ విషయ వస్తువును మాదిరెడ్డి సులోచన గారు ప్రెజెంటేషన్ చేసిన విధానం. ఇప్పుడు చదివితే తెలుగు సాహిత్యంలో స్త్రీవాద నవలగా "తరంగాలు" అనే ఈ నవలకు కూడా సముచిత స్థానం దొరకాలి అనిపిస్తుంది. స్త్రీవాద సాహిత్యాన్ని చర్చకు తీసుకు వచ్చే సందర్భాలలో దీన్ని ప్రస్తావించవలసిన అవసరం కూడా ఉంది. వివాహ వ్యవస్థను దూషించడం మాత్రమే ధ్యేయంలా కాకుండా, అందులోనూ, పురుషుల ఆలోచనా విధానంలోనూ రావలసిన మార్పులను చర్చకు తీసుకువచ్చిన మంచి నవల ఇది. ఏ వాదానికికట్టుబడి రాసిన రచన అయినా అందులో కోపం మాత్రమే కాకుండా ఆలోచన, సమస్య మాత్రమే కాక పరిష్కరణ దిశగా సంస్కరణ గురించి చర్చచేయగలిగినప్పుడే దానికి బలం ఉంటుంది. సాహిత్యంలో దీన్ని చాలామంది రచయితలు ప్రస్తుతం విస్మరిస్తున్నారు. దోపిడికి గురవుతున్న వర్గం తమ ద్వేషాన్ని అసహనాన్ని ప్రకటించడం దగ్గరే ఆగిపోతే అది సంపూర్ణమైన రచన కాదు. మాదిరెడ్డిగారి ఈ నవలలో సంపూర్ణత్వంకనిపిస్తుంది. రాసింది ఓ కుటుంబకధ. స్త్రీసమస్యప్రధానం. కాని ఏ స్త్రీజీవితంలోమార్పురావాలన్నాపురుషసమాజంలోఆలోచనపెరగాలి. ఆ వర్గాన్నివిస్మరించిస్త్రీముందుకువెళ్లలేదు. కుటుంబంలో ఇద్దరికీ సమాన ప్రాధాన్యత ఉండాలి. దానికి ఒక్క స్రీ బలవంతురాలయితే ఫలితం ఉండదు. దాన్ని అంగీకరించి, స్వీకరించగల స్థితికి పురుషుడు ఎదగాలి. ఏ వర్గ పోరాటంలోనయినా ఇలాంటి పరస్పర మార్పు లేకుండా సమాజంలో ఏ విధమైన సంస్కరణ జరగదు. ఆ స్పష్టత ఈ రచనలోకనిపిస్తుంది. సాహిత్యం విషయంలో ప్రస్తుతం రెండు వర్గాలు ఉన్నాయి. ఒక వర్గం పాత సాహిత్యం దగ్గరే ఆగిపోయింది. మరోవర్గం కాంటెంపరరీ సాహిత్యం తప్ప అలనాటి రచనల జోలికి వెళ్ళట్లేదు. ఇది తెలుగుపాఠకులలో ఎక్కువగా కనిపిస్తున్న తీరు. పాత సాహిత్యాన్ని అభిమానించేవారు కొత్తగా వస్తున్న పుస్తకాలను, ఇప్పటి తరాన్ని చదివేవాళ్లు పాత రచయితలను చదవడం అవసరం. దానికోసం క్లాసిక్ నవలలుగా చెలామణీ అయిన పుస్తకాలనేకాక మధ్యతరం సాహిత్యాన్ని కూడా అందుబాటులో ఉంచాలి. ఇలాంటి పునఃముద్రణల అవసరం ప్రస్తుతం చాలా ఉంది. దానికై తెలుగు పబ్లిషర్లు కృషి చేయాలని మాదిరెడ్డి సులోచన గారి నవలలు రీప్రింట్ అయినట్లే ఇతర పాపులర్ రచయితల నవలలూ మనకు చేరాలని కోరుకుందాం.

# విప్పి చెప్పేదే కవిత్వం



...నలిమెల భాస్కర్

మునుపు నాకు పులుపు పడేది కాదు
కొన్నాళ్ళకు మసాలాలు కూడా
ఆ తర్వాత ప్రయాణాలూ
బయటి తిళ్ళూ నీళ్ళూ పళ్ళేదు
ఐతే చిత్రంగా ఇప్పుడు
నాకే మాయదారి వ్యాధో కానీ
మనుషులు పడటం లేదు
ఓట్లగుడ్లకై బంగారు ఓటర్ల బాతుల్ని
నానా దాణాలూ వాగ్దానాలతో పెంచుతోన్న
సకల రాజకీయాల మనుషులు
పేదప్రజలు కట్టే పన్నుల్ని వేతనాలుగా మేస్తూ
కనీసకర్తవ్యనిష్ఠ లోపించిన ఉద్యోగాల
మనుషులు
లేవంగానే నిరుపమానమైన భక్తిశ్రద్ధలతో
సెల్ఫోన్లు చేతులకద్దుకుంటోన్న సొల్లు
మనుషులు
మూఢభక్తి ఛానళ్ళ గంగలో
మునిగి తరిస్తోన్న మూర్ఖస్త్రీ మనుషులు
కొండంత రాగం తీసి పిచ్చకుంట్ల పాట పాడి
నట్లు
నిండు జీవితమంతా త్యాగాలు చెప్పి
నిజజీవితంలో ఎంగిలి కూడా విదల్చని
ఆదర్శపురుష మనుషులు
అన్ని మతాలూ మంచి చెప్పాయంటూనే
పరస్పరం ద్వేషానలదగ్ధులవుతోన్న
సర్వ మతాల మనుషులు
తుమ్మినా దగ్గినా పార్టీ ఉండాల్సిందేనంటూ
మదిరబంధమే మధురబంధమని
పాడుకుంటూ
ఈ మధ్య
అగో తాగి ఊగుతోన్న, గా... మద్యం మనుషులు
అ/హత్యాచార మనుషులు,డబ్బుల మనుషులు
కట్నకా 'వరులు', 'లాంఛ'న గొండులు
ఎందుకూ
సాహిత్యానికి పేరు తేవటం కాకుండా
సాహిత్యంతో పేరు తెచ్చుకునే మనుషులు
కూడా
ఏ ఒక్కరూ పడటం లేదు
ఇక నేను బాగుపడే యోగం లేదు ఈ రోగం
పోదు

# భూ కబ్జా ??



- కందాళై
రాఘవాచార్య
8790593638



అడవులను
గుట్టలను
చెరువులను
స్మశానాలను
మహా తెలివిగా కబ్జా
చేస్తున్నామని అనుకుంటారు

భూమి ఎప్పటికీ కబ్జా కాదు !
సమాధిలో పూడ్చి భూమే
అందరినీ కబ్జా చేస్తుంది !
గర్విష్టి మనుషులది చావు తెలివి
అడ్రసు లేకుండా మట్టిలో కలిసిపోతారు !!

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# నాలుగు కాలాలు నిలిచే కథలు

కథలు మక జీవితాలకు ప్రతిబింబాలు. మన చుట్టూ చోటుచేసుకుంటున్న యధార్ధ సంఘుటనలు, సన్నివేశాలు అధాంతంగా పరిశీలిస్తే కధారచయిత తక దైన ప్రత్యేకతని కథల్లో చూపాలి. పాదకుడు కథలో మమేకమవ్వాలి. కథల్లోని సన్నివేశాలతో పాఠకుడు వందశాతము ఏకీభవించాలి. అంతేకాదు., చిత్రీకరించబడిన పాత్రలపై పాఠకుడికి సానుభూతి కలగాలి, ఒక్కోచోట కథల్లోని పాత్రలు తప్పుదారికి పోతున్నా ఆ పాత్రలు పాఠకుడి సానుభూతి , ఇవన్నీ కథకు ఉండకలిసిన లక్షణాలు, కథతో పాటు కథనం కూడా రాణించాలి. పాఠకుడు చదివే విధంగా ఉండాలి. చెప్పగలిగే నేర్పు ఉంటే, ఏడు చేపలు, ఒకటి ఎండని కథ కూడా రాణిస్తుంది. కథకు ఉండాల్సిన మరో లక్షణం పాఠకుడిని ఆలోచనలో పడవేయగలగాలి. పుస్తకాన్ని చదవడం పూర్తయిన తరువాత కూడా! వర్తమాన సమాజ దృష్యీకరణ కథకు మరో అవసరం." అంతే కాదు అవసరం కూడా! వరూధిని ప్రవరాఖ్యుల గురించి శకుంతల దుష్యంతుల గురించి మళ్ళీ చెప్పవచ్చు. కాని ఈ 'చర్విత చర్వణం' పాఠకుడిని ఆకట్టుకోలేదు. నవ్యత, నాణ్యత, సమకాలీనత, ఆదనపు ఆకర్షణలు.. ఇవన్నీ, కె.ఎ ముని సురేష్ పిళ్ళె గారి గారడీవాడు! కథా సంకలనంలో కనిపిస్తాయి. స్థలాపారలమైన న్యాయంగా సంకలనంలోని ఒకటి రెండు కథలు విశేషిస్తాను. ప్రస్తుత కంటే సుప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ప్రకటించిన స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణం గురించి 'అంజమ్మ బస్సుప్రయాణం' కథలో వివరించబడింది. బస్సును ఆడజన సంద్రం ముంచెత్తుతోందట. అందులో దుమికితే బతుకుదునా చచ్చుదునా (కొత్త పద ప్రయోగం) అనే భయం పెరుకులాట. ఆయినా "పైనమై వచ్చినంక పానాల మీద గుబులేమున్నది.. స్త్రీ అని తెగించిందట అంజవ్వ. అవ్వను జనం ఎగసిన కెరటంలా ఎత్తి లోపల పడేసిందట, ఆ ఆడవాళ్ళ సామాజిక స్థితి గమ్యం చెప్పలే ఎరుగని వాళ్ళు చెప్పులున్న వాళ్ళు హై హిల్స్ తొడిగిన వాళ్ళు, బూట్లు వాటిని వేసినవాళ్ళు అన్ని రకాలూ ఉన్నారట.

బస్సంతా కలహ కోలాటంగా, వికటోత్సవంగా (క్రొత్త పదం) ఉందట. బస్సు ఎక్కిన అవ్వకు సీటు దొరికింది. ప్రక్కన ఈ కథ చెబుతున్న ప్రయాణికురాలు ఉంది ఆమె దృష్టికోణంతో బస్సులోని జనానికి పరిచయం చేస్తారు రచయిత. ఆ పరిచయం చదువుతున్న పాఠకుడు ఆమెతో పయనిస్తున్నంత సహజంగా రచయిత నిపుణలకు తెలియజేస్తుంది.

మరో కథ 'కుడి పైట'లో మలేసియా తెలుగు ఆడవారు పైటను కుడి వైపు ఎందుకు వేస్తారో చెప్పటం ఒక గొప్ప శోధన 'వితండం మామ' స్థిత ప్రజ్ఞతకు ముగ్ధులమై పోతాము. టైటిల్ కథ 'గారడీవాడు'లో ఒక గుడి దేవుడు ఎలా ప్రాచుర్యంలోకి వస్తాడో చెప్పటం బాగుంది. కాళహస్తి గుడిలో మూల విరాట్టుకన్నా రాహుకేతువులే కలెక్షన్ కింగులయ్యారు (పే47). సెల్లులు వచ్చాక కాలర్ ట్యూనులతో దేవుడు భక్తులకు సులభంగా దొరికిపోతాడట (పే 45), టికట్టు, క్యూలైను ఉండటం వల్ల పాతాళగణపతి Must see దేవుడయ్యాడట. దర్శనం ఎంత కష్టంగా ఉంటే అంత పవర్ ఫుల్ గాడ్ అవటం సామాన్యుడి ఆలోచన (పే. 49) ఈ పరిశీలనలు అన్నీ చదువరికి యదార్ధం అనిపిస్తాయి. బాస్ ఈజ్ ఆల్వేజ్ రైట్, నేను మా వెన్నంటి వచ్చే వాడినే తప్ప మీలో సమానంగా ప్రయాణం చేయగలిగిన వాడిని కాదు (పే46). ప్రతి సబార్డినేటుకు ప్రత్యక్ష అనుభవమే .
మ్యాక్లియర్ కుటుంబంలో వయసు మళ్లిన వారి బ్రతుకులు దుర్భరం ఆవుతున్నాయని ఒంటరి వాళ్ళకు 'పింఛన్' ప్రకటించింది ప్రభుత్వం. గేణమ్మమగడు ఉండి కూడా ఒంటరిదైతే బ్రతుకు తెరువు కోసం గేణమ్మ తాగుబోతు మగడికి 'విడాకులు' ఇచ్చి పింఛన్ సాధించుకుంటే, గేణమ్మ మీద మనకు అసహ్యం కలగదు. జాలి కలుగేట్లుగా చిత్రించటం రచయిత ప్రతిభ.

'తగు మాత్రం తీపి కావల్సినంత పచ్చ కర్పూరం ఘాటు, బాదాం, కాజు, కిసిమిసి పలుకుల కమ్మదనం అన్నీ సమపాళ్ళలో కలిసి అలరించినవి ఈ కథలు' అంటారు ప్రముఖ సినీనటుడు నిర్మాత దర్శకుడు తనికెళ్ళ భరణి. ఇది నిజం. ఏ వాదాలకు పోకుండా ఏ ఇజాల మరకలు అంటకుండా, మానవతా వాదమే మూల సూత్రంగా రాసిక ఈ కథలు నాలుగు కాలాల పాటు నిలుస్తాయి. చదివినకొద్ది, క్రొత్త రుచులూరుతాయి. రాయలసీమ యాసను ఎంత ఈజీగా వాడారో, తెలంగాణ భాష, యాసను అంత ఈజీగా వాడి కథకు పన్నివేశానికి సహజత్వం చేకూర్చటం బావుంది..

- కూర చిదంబరం
8639338675




గారడీవాడు. కె.ఎ, ముని సురేష్ పిళ్ళె కథలు, వెల రూ. 200/- కాపీలకు. విశాలాంధ్ర) నవోదయా, మరియు రచయిత: 99594 88088.)

### ఆ దేశంలో పురుషుల హస్త ప్రయోగంపై నిషేధం..

## అతిక్రమిస్తే 8 లక్షల వరకు జరిమానా?

### అతిక్రమిస్తే 8 లక్షల వరకు జరిమానా వేయాలి

### అమెరికాలో బిల్లు ప్రవేశపెట్టిన డెమొక్రాట్ సెనేటర్



**వాషింగ్టన్, జనవరి 31:** పురుషులు హస్త ప్రయోగం చేసుకోకుండా నిషేధించాలని, అతిక్రమిస్తే నేరంగా పరిగణించాలని అమెరికా సెనేట్ ముందుకు ఒక బిల్లు వచ్చింది. డెమోక్రటిక్ పార్టీకి చెందిన మిసిసిప్పి సెనేటర్ బ్రాడ్‌ఫర్డ్ బ్లాక్‌మన్ గత వారం ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు 'గర్భనిరోధకం అంగస్తంభన వద్ద ప్రారంభం' అని పేరు పెట్టారు. ఒకవేళ ఈ బిల్లు చట్టరూపం దాల్చి అమలులోకి వస్తే మిసిసిప్పి రాష్ట్రంలో పురుషులు హస్త ప్రయోగం చేసుకోవడం, పిండాన్ని ఫలదీకరించే ఉద్దేశం లేకుండా శృంగారంలో పాల్గొనడం నేరం అవుతుంది.

చట్టాన్ని అతిక్రమించిన వారికి మొదటిసారి రూ.86 వేలు, రెండోసారి రూ.4.33 లక్షలు, తరచూ ఉల్లంఘించే వారికి రూ.8.65 లక్షల జరిమానా విధించాలని బిల్లులో ప్రతిపాదించారు. అయితే, ఇందులో కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. వీర్యదానం కోసం హస్త ప్రయోగం చేసుకోవడం, కండోమ్ వాడి శృంగారంలో పాల్గొనడం మాత్రం ఈ బిల్లు ప్రకారం నేరం కాదు. అయితే, ఈ బిల్లు ఆమోదం పొందే అవకాశాలు దాదాపుగా లేవు.

**బిల్లు పెట్టేందుకు కారణమిదే..**

ఈ బిల్లు ప్రవేశపెట్టిన బ్లాక్‌మన్‌పై విమర్శలతో పాటు బెదిరింపులు కూడా వస్తున్నాయట. తాను మాత్రం అమెరికా శాసన ప్రక్రియలోని ద్వంద్వ ప్రమాణాలను వెలుగులోకి తీసుకురావడానికే వ్యంగ్య రూపంగా ఈ బిల్లును ప్రవేశపెట్టినట్టు బ్లాక్‌మన్ చెప్తున్నారు. మహిళల పునరుత్పత్తి హక్కులపై ఆంక్షలకు ఇది ప్రతిస్పందన అని తెలిపారు. దేశంలో, ముఖ్యంగా మిసిసిప్పిలో గర్భనిరోధకం, అబార్షన్‌కు సంబంధించి ప్రవేశపెడుతున్న మెజార్టీ బిల్లులు మహిళల పాత్రపైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నాయని, పురుషుల పాత్రను పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు. గర్భనిరోధకంలో పురుషుల పాత్ర ఉంటుందనే నిజాన్ని చర్చకు తీసుకురావడమే ఈ బిల్లు ఉద్దేశమని చెప్పారు.


## సూడాన్ మార్కెట్‌లో పారామిలిటరీ దాడులు

### 54 మంది మృతి, 158 మందికి గాయాలు




**కైరో:** సూడాన్ పారామిలిటరీ దళాలు (ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్) శనివారం ఒందుర్మన్ నగరంలోని ఓ మార్కెట్‌పై విరుచుకుపడ్డాయి. విచక్షణారహితంగా దాడులు చేయడంతో 54 మంది మరణించగా, 158 మంది గాయపడ్డారు. ఈ దాడుల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తుల విధ్వంసం జరిగింది. ప్రభుత్వ సైన్యం, పారామిలిటరీ అధినేతల మధ్య వైరుధ్యాలు రావడంతో సూడాన్‌లో 2023 ఏప్రిల్ నుంచి అంతర్యుద్ధం జరుగుతున్నది. ఫలితంగా ఇప్పటి వరకు 28 వేల మందికిపైగా మరణించగా, లక్షలాది మంది తమ ఇళ్లను విడిచి పారిపోయారు.

## తెలంగాణలో పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు




**హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా సాధారణ పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. అన్ని జిల్లాల్లో 30 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. శనివారంతో పోలిస్తే అన్ని జిల్లాల్లో 2 నుంచి 6 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్ జిల్లాలో 36.5, భద్రాద్రికొత్తగూడెంలో 35.6, హనుమకొండ, హైదరాబాద్‌లో 34, ఖమ్మంలో 34.6, మహబూబ్‌నగర్ 36.1,మెదక్ 34.8, నల్లగొండలో 31.5, నిజామాబాద్‌లో 34.5, రామగుండంలో 34 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే వారం రోజులు ఇదే వాతావరణం ఉంటుందని వాతావరణశాఖ వెల్లడించింది.





## చిరుతను చెట్టెక్కించిన గ్రామ సింహం

**కుమ్రం భీం ఆసిఫాబాద్ :** వన్య మృగాలు అంటేనే మనషులు హడలిపోతారు. అలాంటి మృగాలు గ్రామాల్లోకి రావడం సాధారణమైంది. సింహాలు, పులులు గ్రామ వీధుల్లో సంచరిస్తూ జనాలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. అయితే ఓ గ్రామంలోకి ప్రవేశించిన చిరుత పులికి ఓ కుక్క చుక్కలు చూపించింది. ప్రజలను పరుగులు పెట్టించిన ఆ చిరుత పులికి.. గ్రామ సింహం ఉరుకులు పెట్టించింది. శునకం దెబ్బకు చిరుత పులి చెట్టెక్కి కూర్చుంది. అయినా కూడా కుక్క తన అరుపులతో చిరుతను భయపెట్టించే ప్రయత్నం చేసింది. ఈ దృశ్యం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆవిష్కృతమైంది. తిర్యాని మండలం చింతపల్లి గ్రామ శివారులో చిరుతపులి కలకలం రేపింది. గ్రామంలోకి ప్రవేశించిన చిరుతను ఓ కుక్క తరమడంతో అది భయంతో అక్కడే ఉన్న ఓ ఎత్తయిన చెట్టుపైకి ఎక్కి చిటారు కొమ్మన కూర్చుంది. ఈ కుక్క చెట్టుపైకి చూస్తూ అదేపనిగా మొరుగుతుండటంతో అనుమానం వచ్చిన స్థానికులు ఏమై ఉంటుందా అని అక్కడికి వచ్చి పరిశీలించగా చెట్టుపైన చిరుత కూర్చుని కనిపించింది. దానిని చూసి షాకైన స్థానికులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. మరోవైపు స్థానికులు చెట్టుపై కూర్చున్న చిరుతను తమ మొబైల్స్‌లో వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న అటవీ అధికారులు, సిబ్బంది చిరుత పాదముద్రలు సేకరించారు. చిరుతను బంధించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చిరుత సంచారం నేపథ్యంలో స్థానికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



## మీ ఓటీపీ ఎంత సేఫ్

### సైబర్ మోసాల నుంచి తప్పించుకోవడానికి ఉన్న ఈ విధానాలు తెలుసా!

ఆధార్ కార్డు.. బ్యాంకు లావాదేవీలు.. పాన్‌కార్డులో మార్పులు.. ఏది చేయాలన్నా ముందుగా అడిగేది.. 'ఓటీపీ వచ్చిందా?' అని! అయితే, ఈ వన్ టైమ్ పాస్‌వర్డ్‌తో వస్తున్న సమస్యలు అన్నీ ఇన్నీ కావు. ఆన్‌లైన్ లావాదేవీల్లో ఓటీపీ మోసాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. డిజిటల్ డెన్‌లో సైబర్ నేరగాళ్లు విజృంభిస్తున్న తరుణంలో.. ఈ ఓటీపీలు ఎంతవరకు సురక్షితం? అన్న సందేశం తలెత్తకమానదు. సిమ్ స్వాపింగ్, సెక్యూరిటీ ప్రోటోకాల్ లోపాలు ఓటీపీ భద్రతపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మరింత పటిష్ఠమైన, ఆధునికమైన భద్రత కల్పించే ఆథెంటికేషన్ పద్ధతులు బయోమెట్రిక్ వెరిఫికేషన్, పాస్‌వర్డ్‌లెస్ ఆథెంటికేషన్ అవసరమని నిపుణుల అభిప్రాయం. OneTime Password (OTP) అంటే ఒకేసారి మాత్రమే ఉపయోగించగల సాంకేతిక పాస్‌వర్డ్. దీన్ని మన ఆన్‌లైన్ లావాదేవీలు, బ్యాంకింగ్ కార్యకలాపాలు, ఇతర డిజిటల్ వ్యవహారాలకు ఉపయోగిస్తుంటాం. 1990 దశకంలో మొదటిసారి ఈ పద్ధతి పరిచయం అయింది. అప్పటికి ఉన్న పరిస్థితుల్లో డిజిటల్ భద్రతను పటిష్ఠం చేయడమే దీని ప్రధాన ఉద్దేశం. 2000 సంవత్సరం నుంచి ఈ విధానం మరింత ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆన్‌లైన్ లావాదేవీలను ధ్రువీకరించడానికి పాస్‌కోడ్ ఓ సురక్షితమైన విధానంగా అమల్లోకి వచ్చింది. టెక్నాలజీ అప్‌డేట్ అవుతున్న కొద్దీ.. ఈ ఓటీపీలు హ్యాకర్ల చేతికి చిక్కుతున్నాయి. తెలివిమీరిన స్కామర్లు ఓటీపీలు జనరేట్ చేసి మరీ.. నిండా ముంచుతున్నారు. సిమ్ స్వాపింగ్, ఫిషింగ్ దాడుల కారణంగా ఎస్సెమ్మెస్ ఆధారిత ఓటీపీల భద్రతపై సందేహానికి తావిస్తున్నది.

### ఏపీలో అంతుచిక్కని వైరస్..

# లక్షల్లో కోళ్లు మృతి

**మహా:** ఏపీలో కోళ్లకు అంతుచిక్కని వైరస్ కలవరపెడుతున్నది. సాయంత్రానికి ఆరోగ్యంగా కనిపించే కోళ్లు.. ఉదయం వరకు అనారోగ్యంతో మృత్యువాతపడుతున్నాయి. అలా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రోజుకు వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. దీంతో లక్షల రూపాయల నష్టం వస్తుందని కోళ్ల ఫారాల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.



H15N వైరస్ లక్షణాలతోనే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రోజుకు వేల సంఖ్యలో కోళ్లు మరణిస్తున్నాయని తెలుస్తోంది. డిసెంబర్‌లోనే ఈ వైరస్ మొదలైంది. సంక్రాంతి సమయంలో అంటే జనవరి 13 వరకు ఈ వైరస్ విజృంభించింది. ఈ వైరస్ కారణంగా ఇప్పటికే 40 లక్షల కోళ్లు చనిపోయి ఉంటాయని ఒక అంచనా. దీంతో పౌల్ట్రీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

కోళ్లకు ఈ H15N వైరస్ రావడం ఇదే తొలిసారి ఏమీ కాదు. 2012, 2020లో కూడా ఇదే తరహాలో వైరస్ వ్యాపించింది. నాలుగేళ్ల క్రితం ఈ వ్యాధి సోకిన అనేక కోళ్లు మృత్యువాతపడ్డాయి. అప్పుడు కోళ్లు ఎందుకు చనిపోతున్నాయో కూడా తెలియని అయోమయం నెలకొంది. వైరస్ సోకి కోళ్లు మరణిస్తున్నాయనే వార్త బయటకు రాగానే అమ్మకాలు కూడా గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో చికెన్ ధరలు భారీగా దిగొచ్చాయి. అప్పుడు వైరస్ సోకడానికి చాలా రోజుల సమయం పట్టింది. ఇప్పుడు మళ్లీ అదే తరహా వైరస్ వ్యాపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వైరస్ సోకిన కోడికి లక్షణాలు ఏమీ కనిపించవు. ఎప్పటిలాగే ఆరోగ్యంగా తిరుగుతున్నట్టే కనిపించి.. ఉన్నట్టుండి చనిపోతుంది. ఈ వైరస్ సోకితే దాని ప్రభావం నేరుగా గుండెపైనే ఉంటుందని పశువైద్యులు చెబుతున్నారు. వైరస్ సోకిన కోడికి గుండెనిండా నీరు పట్టేయడం వల్ల గుండెపోటు వంటిది సంభవించి చనిపోతాయని పేర్కొంటున్నారు. వైరస్ సోకిన కోడిని గుర్తించి వ్యాక్సిన్ వేసినా ఫలితం ఏ మాత్రం ఉండదని అంటున్నారు.

## పాంక్రియాటిక్ క్యాన్సర్‌కు ముక్కు తాడు

### ముక్కు నుంచి ఔషధం అందించే విధానం అభివృద్ధి

**హ్యూస్టన్ :** ప్రాణాంతక పాంక్రియాటిక్ క్యాన్సర్ చికిత్సకు అమెరికాలోని రైస్ యూనివర్సిటీ పరిశోధకులు కొత్త విధానాన్ని అభివృద్ధి చేశారు. పాంక్రియాటిక్(క్లోమ గ్రంధి) క్యాన్సర్ కణతులు చిన్న పేగు వంటి కీలకమైన అవయవాలకు సమీపంలో ఏర్పడతాయి. దీంతో అధిక డోస్‌తో రేడియేషన్ థెరపీ చేయడం వల్ల తీవ్రమైన జీర్ణకోశ సంబంధ సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. క్యాన్సర్ కణతుల సమీపంలోని ఆరోగ్యకర కణజాలానికి నష్టం కలుగుతుంది. అయితే, ఆమైఫోస్టిన్ అనే ఔషధం రేడియేషన్ థెరపీ చేస్తున్నప్పుడు ఆరోగ్యకర కణజాలానికి రక్షణనిస్తుంది. ఇప్పటివరకు సిరల ద్వారా ఇచ్చే ఈ ఔషధం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ అధికంగా ఉంటున్నందున ఎక్కువగా వినియోగించడం లేదు. నోటి నుంచి ఈ ఔషధాన్ని ఇస్తే కడుపులోని ఆమ్లాలు దాని ప్రభావాన్ని తగ్గించేస్తాయి. దీంతో రైస్ యూనివర్సిటీ పరిశోధకులు ఈ ఔషధాన్ని ముక్కు నుంచి ఇచ్చే పద్ధతిని తయారు చేశారు. ఒక ట్యూబ్ ద్వారా నేరుగా ముక్కు నుంచి జీర్ణ వాహిక పై భాగానికి అందించవచ్చని వీరు చెప్తున్నారు. తద్వారా రేడియేషన్ థెరపీ సమయంలో ఆరోగ్యకర కణజాలానికి కలిగే నష్టాన్ని నివారించవచ్చని తెలిపారు. ఈ పద్ధతిని ఎలుకలపై ప్రయోగించగా సత్ఫలితాలు వచ్చాయని చెప్పారు.





## కష్టపడ్డవారికే బంగారు విష్యత్తు:కందిశ్రీనివాసరెడ్డి





**ఆదిలాబాద్ మహా:** కష్టపడ్డవారికే భవిష్యత్తు ఉంటుందని, లక్ష్యం ఎంచుకుని ఆ దిశగా సాధన చేస్తే తప్పకుండా జీవితంలో విజయం సాధిస్తార ని, ఉన్నతస్థాయికి ఎదుగుతారని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి దిశా నిర్దశం చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని విద్యార్థి కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంది శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవ్వగా ఆయన చేతుల మీదుగా ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. అనంతరం కష్టపడి చదివి ఎగ్జామ్ మంచిగా రాయాలంటూ విద్యార్థులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. పదో తరగతి పరీక్షలు జీవితానికి పునాది వంటివని, మంచిగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కష్టాన్ని నమ్ముకుని కృషి, పట్టుదలతో ముందుకుసాగాలని, అప్పుడే బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఉన్నత ఉద్యోగాలు సాధించి ఆదిలాబాద్ అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని, ఇక్కడ పరిశ్రమల స్థాపనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కష్టాన్ని నమ్ముకున్నవారికి విజయం వారి బానిస అవుతుందన్నారు. త్వరలోనే కెరీర్ గైడెన్స్‌పై కేఎస్ఆర్ ఫౌండేషన్, అమ్మన్యూస్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి శాంతన్‌రావు, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, యెల్మ రాంరెడ్డి, షకీల్, రఫిక, దేరా కృష్ణారెడ్డి, గడ్డం అఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌పై
## మంత్రి పొంగులేటి కీలక ప్రకటన

- ఈనెల 15లోపు పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల..- కులగణన నివేదిక కేబినెట్ సబ్ కమిటీకి త్వరలో రిజర్వేషన్ల నిర్ణయం




**ఖమ్మం, ఫిబ్రవరి 2 , మహా:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌పై కీలక ప్రకటన చేశారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. ఈనెల 15లోపు పంచాయితీ, మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అలాగే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను కూడా పూర్తిస్థాయిలో అమలు చేస్తామని తెలిపారు. పంచాయితీ ఎన్నికలలోపు అర్హత కలిగిన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు అసత్యమని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. తెలంగాణలో కులగణన, రిజర్వేషన్ల అంశంపై కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈరోజు కులగణన నివేదిక కేబినెట్ సబ్ కమిటీకి అందించగా, త్వరలో సీఎం రేవంత్ రెడ్డికి సమర్పించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. రిజర్వేషన్ల వర్గీకరణ పూర్తయిన వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వానికి ఏడాది పూర్తి కావొస్తున్న సందర్భంగా అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంటోంది. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను, నెరవేర్చని హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓటర్లను ఆకర్షించాలని యత్నిస్తున్నాయి. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్నాయి.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..ప్రభుత్వ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్





**వరంగల్, మహా:** ప్రభుత్వం నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ఆదివారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల, ప్రభుత్వ పోస్ట్ మెట్రిక్ ఎస్సీ బాలుర వసతి గృహం, పోస్ట్ మాట్రిక్ బాలికల వసతి గృహం, పెద్ద కొర్పోల్ లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి) లను కలెక్టర్ డాక్టర్ సత్య శారద, స్థానిక తహశీల్దార్ రాజ్ కుమార్, ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్ లతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో రిజిస్టర్లు, వంట గదిని, డైనింగ్ హాల్ ను, స్టోర్ రూమ్ లలో సరకులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మెనూ ను కచ్చితంగా అమలు చేయాలని, భోజనం తయారు కోసం నాణ్యమైన వస్తువులను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ ,కేర్ టేకర్ లు భోజనం వండే సమయాలలో, విద్యార్థులు భోజనం చేసే సమయాలలో కిచెన్ షెడ్, డైనింగ్ హాల్ లలో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం కోసం తయారు చేసిన వంట పదార్థాలను కలెక్టర్ పరిశీలించారు. వంట వండే సిబ్బంది చూసి శుభ్రతతో ఉండాలని సూచించారు. డైనింగ్ హాల్ , కిచెన్ షెడ్ పరిశుభ్రత పాటించాలని లేనిచోకఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పోస్ట్ మెట్రిక్ ఎస్సీ బాలుర వసతిగృహం లో విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. వసతి.గృహాల్లో ఫిర్యాదుల పెట్టెలను కలెక్టర్ స్వయంగా తెరచి ఫిర్యాదులను పరిశీలించారు. ఏ సమస్య ఉన్నను నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చని, సదుపాయల, విద్యా పరంగా కూడా సూచనలు చేయవచ్చని కలెక్టర్ విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్ళు, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.




## సంచార పశు వైద్య సిబ్బందికి అందని వేతనాలు

- ఆరు నెలలుగా కుటుంబ పరిస్థితి అధ్వానం
- సకాలంలో వేతనాలు అందించి ఆదుకోవాలి

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 2 మహా:** తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో ముగజీవాలకు వైద్యం అందించుట కోసం, ప్రభుత్వం 2017వ సంవత్సరంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 1962 (అంబులెన్స్) పేరుతో సంచార పశు వైద్యశాలను ప్రభుత్వం ప్రారంభించింది. ఒక్కో వాహనంలో ఒక డాక్టర్, పారావెట్, కెప్టెన్, హెల్పర్ తో కలిసి నలుగురు చొప్పున సిబ్బందిని నియమించారు. వీరికి గత ఆరు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. సమయానికి జీతం రాక కుటుంబ పోషణ భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సకాలంలో వేతనాలు చెల్లించి తమను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైనా, ఇప్పటి వరకు పశుసంవర్ధక శాఖకు మంత్రిని నియమించక పోవడంతో తమ సమస్యలు చెప్పుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. 1962 అంబులెన్స్ వాహనానికి సమయానికి మందులు సరిపడ రావటం లేదని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని సంచార పశు వైద్యశాల బలోపేతానికి కృషి చేయాలని 1962 అంబులెన్స్ సిబ్బంది కోరారు.

## ఐ హోమ్స్ ది లెవెన్ ప్రాజెక్ట్ బ్రోచర్ రిలీజ్

- నాణ్యమైన నిర్మాణాలు చేపట్టాలి..వినియోగదారుల అభివృద్ధికి తగ్గట్టు ఉండాలి స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 2 మహా:** ఆదిభట్లలోని ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఐ హోమ్స్ కంపెనీ సెకండ్ ప్రాజెక్ట్, ది 11 ప్రాజెక్ట్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు ప్రారంభించింది. ఐ హోమ్స్ కంపెనీ ది 11 ప్రాజెక్ట్ ప్రజలకు అనుగుణంగా అత్యాధునిక హంగులతో అపార్ట్మెంట్లోని ప్లాట్లను నిర్మించడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఐ హోమ్స్ కంపెనీ ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా హాజరైన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఐ హోమ్స్ చైర్మన్ నాగరాజుతో కలిసి ది 11 ప్రాజెక్ట్ బ్రోచర్ రిలీజ్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ది 11 ప్రాజెక్ట్ చైర్మన్ నాగరాజుగౌడ్, వినియోగదారులకు నాణ్యమైన ప్లాట్లను విక్రయించాలని అన్నారు. వ్యాపారం చేసే సమయంలో ఎక్కడ కూడా నాణ్యత లోపించకుండా నిర్మాణాలు చేపట్టి వినియోగదారుల అభిరుచికి తగ్గట్టు ప్లాట్లను నిర్మించి ఇచ్చేలా ఉండాలని నిర్వాహలకు సూచించారు. వారి వ్యాపారం అభివృద్ధి చెందేలా ఉండాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నీ రంగాలను అభివృద్ధి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, బడంగ్ పేట్ మాజీ మేయర్ సామ నరసింహాగౌడ్, ఏఎంసీ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి గురునాథ్ రెడ్డి ఈసీ శేఖర్ గౌడ్, ఆదిభట్ల మున్సిపాలిటీ అధ్యక్షులు బాలరాజు గౌడ్, నరసింహ గౌడ్, పల్లె గోపాల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## బాసరకు పోటెత్తిన భక్తులు
### అక్షరాభ్యాస మండపం కిటకిట

**బాసర, మహా:** వసంత పంచమి సందర్భంగా ఆదివారం బాసర పుణ్యక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. సరస్వతి అమ్మవారి జన్మదినం కావడంతో అక్షరాభ్యాస పూజల కోసం పిల్లలను అధిక సంఖ్యలో తీసుకొచ్చారు. దీంతో అక్షరాభ్యాస మండపం కిటకిటలాడింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండే కాక మహారాష్ట్ర, కర్ణాటక తమిళనాడు నుంచి భక్తులు తమ పిల్లలను తీసుకొచ్చి అక్షరాభ్యాసం చేయించారు. ఉదయం ఆరు గంటల నుండి అమ్మవారి మండపం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మూడు ప్రత్యేక అక్షరాభ్యాస మండపాలతోపాటు, సాధారణ అక్షరాభ్యాస మండపంలో ఆలయ అర్చకులు పూజలు నిర్వహిస్తున్నారు. వసంత పంచమి సందర్భంగా... అమ్మవారి జన్మదినం వసంత పంచమి పురస్కరించుకొని జ్ఞాన సరస్వతి దేవి కొలువైన బాసర అమ్మవారి చెంత అక్షరాభ్యాస పూజలు జరిపిస్తే చిన్నారులు ఉన్నత విద్యావంతుల అవుతారని భక్తుల నమ్మకం. దేశంలోని రెండు సరస్వతి ఆలయాలలో ఒకటి కాశ్మీర్‌లో ఉండగా, రెండోది తెలంగాణ రాష్ట్రం నిర్మల్ జిల్లా బాసర పుణ్యక్షేత్రంలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి నిలయం కలదు. వసంత పంచమి సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలు పూలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

## కార్పొరేట్ ప్రయోజనాలకే కేంద్ర బడ్జెట్

- సిపిఎం మండల కార్యదర్శి బుగ్గరాములు విద్య వైద్యానికి తూట్లు పొడిచారు
- ప్రమాదంలో దేశ బీమా సంస్థలు



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 2 మహా:** కార్పొరేట్ ప్రయోజనాల కోసమే కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టారని సిపిఎం మండల కార్యదర్శి బుగ్గరాములు అన్నారు. శనివారం పార్లమెంట్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఆదివారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం సాగర్ రహదారిపై కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బుగ్గరాములు మాట్లాడుతూ కేంద్రం 202526 సంవత్సరానికి ప్రవేశపెట్టి 50,65,345/ కోట్ల బడ్జెట్లో బడా కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడే బడ్జెట్ తప్ప సామాన్య ప్రజలకు లబ్ధి కల్పించే విధంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భారత భీమ రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులు అనుమతిస్తూ దేశభీమ సంస్థల ఉనికిని ప్రమాదంలో పడేసే విధంగా ఉందన్నారు. విద్య, వైద్యానికి 3శాతం నిధులు కేటాయించడం సరైనది కాదు. వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టి కార్పొరేట్లకు కట్టబెట్టడం కోసమే నిధుల కోత విధించారు. వ్యవసాయ ఎరువులపై సబ్సిడీలో కోత విధించడం సిగ్గుచేటు అన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నట్టు 12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇచ్చిన ద్రవ్యోల్బణం, పెరిగిన ధరలతో పోలిస్తే ఇది తక్కువేనన్నారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు నిధుల కేటాయింపు లేదు. ఉత్తర ప్రదేశ్, బీహార్, ఢిల్లీ ఎన్నికలలో లబ్ధి పొందడానికి ఈ బడ్జెట్ ను పెట్టారు. తెలంగాణలో ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది పార్లమెంటు సభ్యులు ఉన్న తెలంగాణకు నిధులు తీసుకురాని అసమర్థులన్నారు. వెంటనే తెలంగాణకు బడ్జెట్ కేటాయించి అభివృద్ధికి సహకరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జంగయ్య, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేశ, మండల నాయకులు తులసిగారి నర్సింహ, పురుషోత్తం, వీరేశం, స్వప్న, యాదగిరి, వంశీ, తరంగ్, చరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో ఎవరూ సంతృప్తిగా లేరు
### బీజేపీ ఎంపీ డీకే అరుణ

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ పార్టీ లో ఎవరూ సంతృప్తిగా లేరని బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఈ ప్రభుత్వంపై ఎమ్మెల్యేలతో పాటు ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని ఆమె చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వ పాలనపై బయట మాట్లాడలేక.. ఎమ్మెల్యేలు రహస్య సమావేశాలు పెట్టుకొని ఇది అవినీతి ప్రభుత్వని మాట్లాడుకుంటున్నారని డీకే అరుణ చెప్పుకొచ్చారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని, ఇది పర్సంటేజీల ప్రభుత్వం అని, ఈ ప్రభుత్వంలో 10 శాతం కమిషన్ ఇస్తేనే పనులు అవుతాయని బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్ర ఆరోపణలు చేశారు.

## "వేల గొంతులు లక్ష డప్పులు"
## వాల్ పోస్టర్ విడుదల

- ప్రతి ఒక్క మాదిగ బిడ్డ తరలి రావాలని పిలుపు
- నియోజకవర్గం ఇంచార్జ్ సిద్దాపురం శ్రీకాంత్ మాదిగ



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 2 మహా:** ఈనెల 7న హైదరాబాద్ లో జరిగే "వేల గొంతులు, లక్ష డప్పులు" కార్యక్రమం విజయవంతం చేయడానికి ఎమ్మార్పీఎస్ నియోజకవర్గం ఇంచార్జ్ సిద్ధపురం శ్రీకాంత్ మాదిగ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈనెల 7న జరగబోయే వేల గొంతులు, లక్ష డప్పులు కార్యక్రమానికి ప్రతి ఒక్క మాదిగ బిడ్డ తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండలాల అధ్యక్షులు పంది సతీష్ మాదిగ, మూలి మహేష్ మాదిగ, జుట్టు సతీష్ మాదిగ, పల్లాటి సుధాకర్ మాదిగ, ఉద్యోగ సంఘాల నాయకులు చాగంటి అయోధ్య మాదిగ, తదితర మాదిగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## చల్లా వంశీచంద్ రెడ్డికి కీలక బాధ్యతలు

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ ముఖ్య నేత చల్లా వంశీచంద్ రెడ్డికి కాంగ్రెస్ అధిష్టానం కీలక పదవి కట్టబెట్టింది. దేశంలో కేంద్ర ఎన్నికల సంఘం స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహిస్తుందో లేదో పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఎంపవర్డ్ యాక్షన్ గ్రూప్ ఆఫ్ లీడర్స్ అండ్ ఎక్స్‌పర్ట్స్(ఈగల్) అనే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తూ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీ కే. సీ వేణుగోపాల్ పత్రికా ప్రకటన జారీ చేశారు. ఈ కమిటీ మొదట మహారాష్ట్రలో గల్లంతైన ఓటర్ల జాబితా విషయం మీద విచారణ జరిపి, వీలైనంత త్వరగా నాయకత్వానికి వివరణాత్మక నివేదికను సమర్పించనుంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఈ కమిటీని 8 మంది బృంద సభ్యులతో ఏర్పాటు చేయగా.. తెలంగాణకు చెందిన చల్లా వంశీచంద్ రెడ్డికి కూడా ఈ కమిటీలో చోటు దక్కింది. ఈ కమిటీలో అజయ్ మాకెన్, దిగ్విజయ్ సింగ్, అభిషేక్ సింఘ్వి, ప్రవీణ్ చక్రవర్తి, పవన్ ఖేరా, గుర్దీప్ సింగ్ సప్పల్, నితిన్ రావుత్, చల్లా వంశీచంద్ రెడ్డి సభ్యులుగా ఉన్నారు.

## మహా ప్రదర్శనకు ప్రతి మాదిగ డప్పు సంకన వేసుకుని రావాలి

ఎల్బీనగర్,ఫిబ్రవరి 2, మహా: ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్ లో తలపెట్టిన లక్ష డప్పులు వెయి గొంతుల కార్యక్రమానికి కదం తొక్కాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలిపించారు..ఆదివారం ఎమ్మార్పీఎస్ ఎల్బీ నగర్ ఇంచార్జ్ బత్తిన సుధాకర్ ఆధ్వర్యంలో సరూర్ నగర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లక్ష డప్పులు,వెయ్యి గొంతులు పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఉమ్మడి రిజర్వేషన్ ఫలాలను ఒక సామాజి క వర్గం వారే లబ్ది పొందుతూ వచ్చారన్నారు.ఈ రిజర్వేషన్లు మాల, మాదిగల పంచాయతీ కాదని, 59 ఉప కులాలకు సంబంధించిందని తెలిపారు. సుప్రింకోర్టులో ఆరుగురు న్యాయమూర్తులు తీర్పు ఇచ్చారని, దీనిని మాల సామాజిక వర్గం వారు అడ్డుకోవడం మంచిది కాదని తెలిపారు. ఆరు నూరైనా వర్గీకరణ జరిగి తీరుతుందన్నారు. ప్రపంచ చరిత్రలోనే ఏ దేశంలో కని ఎరగని రీతిలో మాదిగల సాంస్కృతిక ఆయుధమైన"" డప్పు""తో మహా ప్రదర్శన నిర్వహిస్తున్నాం.తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సామాజిక వర్గము, 99శాతం ప్రజా సంఘాలు ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అంటూ మన ధర్మపోరాటానికి సంఘీభావం ప్రకటిస్తూనే ప్రత్యక్షంగా ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యేందుకు సమాయత్తమవుతున్నారు... ప్రతి మాదిగ బిడ్డ డప్పు సంకన వేసుకొని హైదరాబాద్ రావాలని విజ్ఞప్తి చేస్తున్నాం.... ఈ కార్యక్రమంలో మాదిగ సంస్కృతిక శాఖ కళామండలి అధ్యక్షులు పల్లెపాక కుమార్, శ్రావణ్ కుమార్, ఎల్లయ్య, మాదిగ డప్పు కళాకారులు పాల్గొన్నారు..



# క్రెడిట్ కార్డుల్లో ఈ రూపే కార్డులు బెస్ట్.. రివార్డులు.. క్యాష్ బ్యాక్ ఆఫర్లు ఇవే..!

గతంతో పోలిస్తే ప్రస్తుతం క్రెడిట్ కార్డుల వాడకం బాగా పెరిగింది. వీసా, మాస్టర్ కార్డ్ వంటి అంతర్జాతీయ సంస్థలకు పోటీగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) రూపొందించిన రూపే క్రెడిట్ కార్డు (Rupay Credit Card)లకు డిమాండ్ పెరిగింది. 2022 జూన్ నుంచి యూపీఐ ప్లాట్‌ఫామ్‌లపై స్మార్ట్ ఫోన్ యూజర్లు స్మూత్‌గా లావాదేవీలు నిర్వహించేందుకు రూపే క్రెడిట్ కార్డు చెల్లింపులను అనుమతించింది. వీసా, మాస్టర్ కార్డులకు బదులు ప్రారంభ దశలో రూపే క్రెడిట్ కార్డులతో యూపీఐ చెల్లింపులకు ఆర్బీఐ పర్మిషన్ ఇచ్చింది. ఇతర ప్రధాన క్రెడిట్ కార్డులతో పోలిస్తే రూపే క్రెడిట్ కార్డులకు ఆదరణ పెరిగింది. క్యాష్ లెస్ ఎకానమీ దిశగా అడుగులేస్తున్న నేపథ్యంలో లభ్యత, చౌక ఫీజులతో అందుబాటులో ఉన్నాయి రూపే క్రెడిట్ కార్డులు. ప్రతి ఒక్కరూ తమ లైఫ్ స్టయిల్, ఆదాయానికి అనుగుణంగా అవసరమైన క్రెడిట్ కార్డును ఎంచుకోవచ్చు.



### రూపే క్రెడిట్ కార్డు – జాయినింగ్ ఫీజు

- ఇండస్ఇండ్ బ్యాంక్ ప్లాటినం రూపే క్రెడిట్ కార్డు – ఫీజు అక్కర్లేదు
- యెస్ బ్యాంక్ పైసా బజార్ పైసా సేవ్ క్రెడిట్ కార్డు – రూ.499
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యూపీఐ రూపే క్రెడిట్ కార్డు – రూ.500
- మైంత్రా కోటక్ క్రెడిట్ కార్డు – రూ.500
- హెచ్‌డీఎఫ్‌సీ మనీ బ్యాక్+ క్రెడిట్ కార్డు – రూ.500
- ఐసీఐసీఐ హెచ్‌పీసీఎల్ సూపర్ సేవ్ క్రెడిట్ కార్డు – రూ.500
- ఐఆర్‌సీటీసీ ఎస్బీఐ ప్లాటినం క్రెడిట్ కార్డు – రూ.300

### ఇండస్ ఇండ్ ప్లాటినం రూపే క్రెడిట్ కార్డు ఫీచర్లు ఇవే

- ప్రతి రూ.100 యూపీఐ లావాదేవీలపై రెండు రివార్డు పాయింట్లు. నాన్ యూపీఐ లావాదేవీలైతే ఒక రివార్డు
- బీమా, ప్రభుత్వ లేదా విద్యా రంగ బిల్లుల వంటి యుటిలిటీ బిల్లులు రూ.100 చెల్లిస్తే ఏడు పాయింట్లు
- ఫ్యుయల్ వినియగంపై ఒకశాతం ఫ్యుయల్ సర్ చార్జ్ మాఫీ (నెలకు గరిష్టంగా రూ.400 ఆదా చేయొచ్చు)
- యూపీఐ పేమెంట్స్ మీద రెండు శాతం రివార్డు పాయింట్లు.
- ఏటా దేశీయ విమానాశ్రయ లాంజ్‌ల్లో 12 కాంప్లిమెంటరీ పాస్‌లు.

### యెస్ బ్యాంక్ పైసా బజార్ పైసా సేవ్ క్రెడిట్ కార్డు ఫీచర్లు ఇలా

- నెలకు రూ.5000 విలువైన షాపింగ్‌పై ఆన్‌లైన్ చెల్లింపులకు మూడు శాతం క్యాష్ బ్యాక్ పాయింట్లు.
- యూపీఐ పేమెంట్స్‌తోపాటు అన్ని రకాల ఇతర చెల్లింపులపై 1.5శాతం క్యాష్ బ్యాక్ పాయింట్లు.
- ఆన్ లైన్ లావాదేవీల్లో మంత్లీ స్పెండింట్ లిమిట్ దాటితే 1.5శాతం క్యాష్ బ్యాక్.
- ఏడాదిలో రూ.1.2 లక్షలు ఖర్చు చేస్తే వార్షిక రెన్యూవల్ ఫీజు మాఫీ.
- ఫ్యుయల్ వినియోగంపై ఒకశాతం సర్‌చార్జి మాఫీ. (నెలకు రూ.250 వరకూ ఆదా)

### ఇలా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యూపీఐ రూపే క్రెడిట్ కార్డు ఫీచర్లు

- పేజ్‌యాప్, గ్రాసరీస్, సూపర్ మార్కెట్, డైనింగ్, యుపీఐ లావాదేవీలపై మూడు శాతం క్యాష్ పాయింట్లు (నెలకు 500 పాయింట్లు)
- యుటిలిటీ చెల్లింపులపై రెండు శాతం క్యాష్ పాయింట్లు ((నెలకు 500 పాయింట్లు)
- ఇతర చెల్లింపులపై ఒకశాతం క్యాష్ పాయింట్లు ((నెలకు 500 పాయింట్లు)
- ఏడాదిలో రూ.25 వేలు ఖర్చు చేస్తే వార్షిక రెన్యూవల్ ఫీజ్ మాఫీ.
- వెల్‌కం బోనస్ కింద రూ.250 గిఫ్ట్ ఓచర్.

### ఇలా మైంత్రా కోటక్ క్రెడిట్ కార్డు బెనిఫిట్స్

- మైంత్రాలో రూ.750 వరకూ లావాదేవీలపై 7.5 శాతం మాఫీ.
- ఒక నెలలో స్విగ్గీ, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, పీవీఆర్, క్లియర్ ట్రిప్, అర్బన్ కంపెనీల్లో రూ.1000 లావాదేవీ జరిపితే ఐదు శాతం క్యాష్ బ్యాక్.
- ఇతర లావాదేవీలపై 1.25శాతం అపరిమిత క్యాష్ బ్యాక్.
- మూడు నెలల్లో రూ.50 వేలు ఖర్చు చేస్తే రెండు పీవీఆర్ టికెట్లు కాంప్లిమెంటరీ
- ఫ్యుయల్ వినియోగంపై ఒకశాతం ఫ్యుయల్ సర్‌చార్జీ మాఫీ (ఏడాదిలో రూ. 3500 ఆదా) – రూ.500- రూ.3000 మధ్య లావాదేవీలు జరపాలి.

### హెచ్‌డీఎఫ్‌సీ మనీబ్యాక్ + క్రెడిట్ కార్డ్ ఫీచర్లు ఇలా

- ఇతర క్యాటగిరీల్లో ప్రతి రూ.150 చెల్లింపులపై రెండు క్యాస్ బ్యాక్ పాయింట్లు
- జాయినింగ్ ఫీజు చెల్లించి వెల్‌కం బెనిఫిట్ పొందితే 500 క్యాష్ పాయింట్లు
- లావాదేవీల్లో వార్షిక మైలురాళ్లు దాటితే రూ.2000 వరకూ గిఫ్ట్ ఓచర్లు
- ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, స్విగ్గీ, రిలయన్స్ స్మార్ట్ సూపర్ స్టోర్, బిగ్ బాస్కెట్ చెల్లింపులపై 10 రెట్లు క్యాష్ పాయింట్లు.
- సెలెక్టెడ్ మర్చంట్ల వద్ద ఈఎంఐ లావాదేవీలపై ఐదు రెట్ల క్యాష్ పాయింట్లు.

### ఐసీఐసీఐ హెచ్‌పీసీఎల్ సూపర్ సేవ్ క్రెడిట్ కార్డు ఫీచర్లు ఇవే

- హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకుల వద్ద చెల్లింపులపై నాలుగు శాతం క్యాష్ బ్యాక్ (నెలకు రూ.200) + ఒకశాతం సర్‌చార్జి మాఫీ.
- హెచ్‌పీ పే యాప్ ద్వారా రూ.100 చెల్లింపుపై ఆరు రివార్డు పాయింట్లతోపాటు అదనంగా 1.5 శాతం ఆదాం
- రిటైల్ కొనుగోళ్లపై రూ.100 చెల్లిస్తే రెండు రివార్డ్ పాయింట్లు.
- హెచ్‌పీ పే యాప్ ద్వారా రీచార్జీ చేసుకుంటే రూ.100 క్యాష్ బ్యాక్ ప్లస్ జాయినింగ్ బోనస్ కింద 2000 రివార్డు పాయింట్లు
- అంతకు ముందు త్రైమాసికంలో రూ.35వేలు ఖర్చు చేస్తే ఒక దేశీయ విమానాశ్రయ లాంజ్ యాక్సెస్ లభ్యం
- హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకుల్లో ఖర్చుపై 6.5 శాతం వరకూ ఆదా.
- గ్రాసరీస్, యుటిలిటీ బిల్లుల చెల్లింపుపై ఐదు శాతం క్యాష్ బ్యాక్.

### ఐఆర్‌సీటీసీ ఎస్బీఐ ప్లాటినం క్రెడిట్ కార్డు ఫీచర్లు

- తొలి 45 రోజుల్లో రూ.500 ఖర్చు చేస్తే రూ.350 విలువ గల 350 రివార్డు పాయింట్లు
- ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ ద్వారా ఏసీ1, ఏసీ2, ఏసీ3, ఏసీ చైర్ కార్ టికెట్లు బుక్ చేసుకుంటే పది శాతం వాల్యూ బాక్.
- ఐఆర్‌సీటీసీ ద్వారా టికెట్ కొనుగోలుతోపాటు ఫ్యుయలేతర లావాదేవీల కోసం ప్రతి రూ.125 ఖర్చుపై ఒక రివార్డు పాయింట్
- ఏటా నాలుగు రైల్వే లాంజ్ కాంప్లిమెంటరీ యాక్సెస్‌లు.
- రైల్వే టికెట్ల బుకింగ్స్ మీద ఒకశాతం ట్రాన్సాక్షన్ ఫీజు మాఫీ.
- అన్ని రైల్వే టికెట్ల బుకింగ్ మీద పది శాతం వాల్యూ బ్యాక్ బెనిఫిట్.



**రాందేవ్ బాబా.. బాలకృష్ణలకు షాక్..**

# కేరళ కోర్టు నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారంట్

యోగా గురువు రాందేవ్ బాబాకు కేరళ కోర్టు షాక్ ఇచ్చింది. ప్రజలను తప్పుదోవ పట్టించే వైద్య వాణిజ్య ప్రకటనలు జారీ చేశారన్న ఆరోపణలపై రాందేవ్ బాబా సారధ్యంలోని పతంజలి ఆయుర్వేదిక్ అనుబంధ దివ్య ఫార్మసీపై కేరళ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణకు హాజరు కానందుకు రాందేవ్ బాబా, పతంజలి సంస్థ సీఈఓ ఆచార్య బాలకృష్ణలకు నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారంట్ జారీ చేస్తూ పాలక్కడ్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ 2 కోర్టు శనివారం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 15న కేసు విచారణకు హాజరు కావాలని ఆ ఆదేశాల్లో పేర్కొంది. ఇంతకు ముందు శనివారం (ఫిబ్రవరి ఒకటో తేదీ) విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసినా రాందేవ్ బాబా, ఆచార్య బాలకృష్ణ గైర్హాజరయ్యారు. దీంతో మేజిస్ట్రేట్ కోర్టు వారికి నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారంట్లు జారీ చేసింది. 1954, డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ (అభ్యంతరకర వాణిజ్య ప్రకటనలు) చట్టంలోని 3, 3 (బీ), 3 (డీ) సెక్షన్ల ప్రకారం దివ్య ఫార్మసీ, ఆచార్య బాలకృష్ణ, రాందేవ్ బాబాలపై కేరళ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కేసులు నమోదు చేశారు. పతంజలి ఆయుర్వేద ఉత్పత్తులపై జారీ చేసిన వాణిజ్య ప్రకటనలు అల్లోపతి వంటి ఆధునిక వైద్య వ్యవస్థలకు వ్యతిరేకంగా ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. తమ తీర్పును ఉల్లంఘిస్తూ వాణిజ్య ప్రకటనలు కొనసాగించడంపై దేశ అత్యున్నత న్యాయస్థానం.. పతంజలి ఆయుర్వేద్‌కు కంటెంప్ట్ నోటీసులు జారీ చేసింది. దీనిపై రాందేవ్, బాలకృష్ణ, పతంజలి ఆయుర్వేద్ బహిరంగ క్షమాపణలు చెప్పిన తర్వాత కంటెంప్ట్ కేసులను మూసేసింది.

## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL

# మరదలిపై హత్యాచారం కోసం రూ.40,000 లోన్ తీసుకున్న బావ




**లక్నో:** తనతో సంబంధం ఉన్న మరదలు అడ్డు తొలగించుకునేందుకు బావ కుట్రపన్నాడు. ఇద్దరితో కలిసి ఆమెపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేశాడు. కిల్లర్స్‌కు డబ్బులు ఇచ్చేందుకు రూ.40,000 లోన్‌గా తీసుకున్నాడు. దర్యాప్తు చేసిన పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పెళ్లైన ఆశిష్‌కు భార్య చెల్లెలైన మరదలుతో వివాహేతర సంబంధం ఏర్పడింది. బ్లాక్‌మెయిల్ చేయడంతో ఆమె అడ్డు తొలగించుకోవాలని అతడు భావించాడు. కాగా, మరదలు హత్య కోసం ఆసుపత్రి ఉద్యోగి శుభమ్ సహాయాన్ని ఆశిష్ కోరాడు. ఆ తర్వాత మరో సహచరుడు దీపక్ వీరికి తోడయ్యాడు. రూ.30,000 ఇస్తే ఆమెను చంపుతామని వారు చెప్పారు. దీంతో ఆశిష్ రూ.40,000 లోన్ తీసుకున్నాడు. అడ్వాన్స్‌గా పది వేలు వారికి చెల్లించాడు. మరదలి హత్య తర్వాత మిగతా రూ.20,000 ఇస్తానని చెప్పాడు. జనవరి 21న ఆశిష్, శుభమ్, దీపక్ కలిసి ఆ మహిళను స్కూటర్‌పై మీరట్‌లోని నాను కాలువ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ ఆమెపై వారు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తర్వాత చున్నీతో గొంతు నొక్కి ఆ మహిళను హత్య చేశారు. పెట్రోల్ పోసి ఆమె మృతదేహాన్ని తగులబెట్టారు. మరోవైపు, మహిళ మిస్సింగ్‌పై ఆమె కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేయగా ఆమె చివరిసారి ఆశిష్, శుభం, దీపక్‌తో కలిసి కనిపించినట్లు తెలుసుకున్నారు. దీంతో ఆశిష్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. నేరం ఒప్పుకోవడంతో పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. మహిళ మృతదేహాన్ని కాల్చిన ప్రదేశం నుంచి ఆధారాలు సేకరించారు. పరారీలో ఉన్న శుభం, దీపక్ కోసం వెతుకుతున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# కాలేజీ టాయిలెట్‌లో విద్యార్థిని ప్రసవం.. ఆ తర్వాత..!



కాలేజీ విద్యార్థిని వివాహం కాకుండానే గర్భం దాల్చింది. నెలల నిండే వరకు విషయం ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడింది. చివరికి గత శుక్రవారం పురటినొప్పులు రావడంతో కాలేజీ టాయిలెట్ లోకి వెళ్లి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం బిడ్డను చెత్తకుండీలో పడేసి వచ్చి క్లాస్‌రూమ్‌లో కూర్చుంది. తమిళనాడు రాష్ట్రం లోని తంజావూరు జిల్లా లో ఈ అమానవీయ ఘటన చోటుచేసుకుంది. అయితే రక్తస్రావం ఎక్కువై ఆమె క్లాస్‌రూమ్‌లో పడిపోవడంతో విషయం బయటికి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. తంజావూరు జిల్లా కుంభకోణంలోని ఓ ప్రభుత్వ మహిళా కాలేజీలో చదువుతున్న 20 ఏళ్ల విద్యార్థిని వివాహం కాకుండానే గర్భం దాల్చింది. విషయం తెలిస్తే సమాజం నిందిస్తుందనే భయంతో నెలలు నిండే వరకు ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడింది. గత శుక్రవారం క్లాస్‌రూమ్‌లో ఉన్న ఆమెకు పురిటినొప్పులు రావడంతో టాయిలెట్‌లోకి వెళ్లింది. అక్కడ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. యూట్యూబ్‌లో చూసి తనే బొడ్డు తాడును కత్తిరించుకుంది. అనంతరం శిశువును తీసుకెళ్లి కాలేజీ ఆవరణలోని చెత్తకుండీలో పడేసింది. ఆ తర్వాత ఏమీ తెలియనట్లుగా వచ్చి క్లాస్‌రూమ్‌లో కూర్చుంది. కానీ రక్తస్రావం తీవ్రం కావడంతో కళ్లు తిరిగి పడిపోయింది. ఇది గమనించిన కాలేజీ అధ్యాపకులు, సిబ్బంది ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు ఆమెకు ప్రసవం జరిగిందని చెప్పడంతో అంతా షాకయ్యారు. ఆపై వైద్యులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. శిశువును ఏం చేశావని విద్యార్థినిని వైద్యులు ప్రశ్నించడంతో కాలేజీ ఆవరణలోని చెత్తకుండీలో వేసినట్లు చెప్పింది. వెంటనే కాలేజీలో ఉన్న సిబ్బందిని అప్రమత్తం చేయగా చెత్తకుండీలో పడివున్న శిశువును తీసుకుని ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ తల్లీబిడ్డ ఇద్దరికీ వైద్యులు ట్రీట్‌మెంట్ చేశారు. ప్రస్తుతం ఇద్దరూ క్షేమంగా ఉన్నారని చెప్పారు. కాగా ఈ అమానవీయ ఘటనపై నాచ్చియార్ కోయిల్ స్టేషన్ మహిళా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సదరు విద్యార్థినికి ఇప్పుడు 20 ఏళ్లు ఉన్నాయని, ఆమె తన సమీప బంధువుతో ప్రేమలో పడిందని, ఫలితంగానే ఆమె గర్భంగా దాల్చిందని పోలీసులు తెలిపారు. సమాజం నిందిస్తుందనే భయంతో గర్భం విషయం ఎవరికీ తెలియకుండా ఇద్దరూ జాగ్రత్తపడ్డారని పోలీసులు చెప్పారు. బాధితురాలు గర్భం దాల్చడానికి కారణమైన యువకుడు కూడా మేజరే అని, అతడు విద్యార్థినితో తనకు ఉన్న సంబంధం నిజమేనని ఒప్పుకున్నాడని తెలిపారు. ఆమెను వివాహం చేసుకునేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని అతడు చెప్పినట్లు వెల్లడించారు. ఇద్దరూ మేజర్లు కావడంవల్ల వారిపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని అన్నారు.

# 'చోళీ కే పీచే క్యా హై' సాంగ్‌కు వరుడు డ్యాన్స్
# పెళ్లి రద్దు చేసిన వధువు తండ్రి



**న్యూఢిల్లీ:** పెళ్లిలో సరదాగా తన ఫ్రెండ్స్‌తో కలిసి డ్యాన్స్ చేసిన వరుడికి వధువు తండ్రి షాక్ ఇచ్చాడు. 'చోళీ కే పీచే క్యా హై' సాంగ్‌కు వరుడు డ్యాన్స్ చేయడంపై ఆగ్రహం చెందాడు. దీంతో పెళ్లిని రద్దు చేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. విస్తూపోయే ఈ సంఘటన దేశ రాజధాని ఢిల్లీలో జరిగింది. పెళ్లికుమారుడు తన కుటుంబం, బంధువులతో కలిసి ఊరేగింపుగా పెళ్లి వేదిక వద్దకు చేరుకున్నాడు. అయితే సరదాగా డ్యాన్స్ చేయాలని స్నేహితులు ఒత్తిడి చేశారు. 'చోలీ కే పీచే క్యా హై' సాంగ్ ప్లే చేయడం, ఫ్రెండ్స్ డ్యాన్స్ చేయడంతో వరుడు కూడా వారితో కలిశాడు. ఆ పాటకు తగ్గట్టుగా హావభావాలతో డ్యాన్స్ చేశాడు. కాగా, వరుడి డ్యాన్స్ చూసి వధువు తండ్రి ఆగ్రహంతో రగిలిపోయాడు. పెళ్లి తంతును వెంటనే ఆపించాడు. పెళ్లికొడుకు చర్యల వల్ల తమ కుటుంబ విలువలకు అవమానం జరిగిందని ఆరోపించాడు. పెళ్లిని రద్దు చేశాడు. మరోవైపు పెళ్లి ఆపేయాలన్న తండ్రి నిర్ణయంతో పెళ్లికూతురు ఏడ్చింది. ఆమె తండ్రికి నచ్చజెప్పేందుకు వరుడు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పెళ్లి రద్దు చేసిన ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అలాగే పెళ్లికొడుకు, అతడి కుటుంబంతో మాట్లాడవద్దని, వారిలో ఎలాంటి సంబంధాలు వద్దని తన కుమార్తెకు తెగేసి చెప్పాడు. కాగా, ఈ వార్తకు సంబంధించిన పత్రిక క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో కొందరు నెటిజన్లు సీరియస్‌గా, మరికొందరు ఫన్నీగా స్పందించారు.

# అమెరికా యాక్షన్.. కెనడా, మెక్సికో రియాక్షన్



**సుంకాల యుద్ధం :** అగ్రరాజ్యం అమెరికా కు.. కెనడా, మెక్సికో దేశాలతో సుంకాల యుద్ధం మొదలైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడా, మెక్సికో దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 25 శాతం సుంకాలు విధించారు. ఈ సుంకాలు ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ నిర్ణయంపై కెనడా, మెక్సికో దేశాలు ప్రతీకార చర్యలకు దిగాయి. అందులో భాగంగా 155 బిలియన్ కెనడియన్ డాలర్ల విలువైన అమెరికా దిగుమతులపై 25% సుంకం విధిస్తునట్లు ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రకటించారు. మెక్సికో కూడా అలాంటి ఆదేశాలే జారీ చేసింది. 155 బిలియన్ కెనడియన్ డాలర్ల అమెరికా దిగుమతులపై 25% టారిఫ్‌లు విధిస్తున్నామని, ట్రంప్ చర్యలకు ఇది ప్రతిస్పందన అని జస్టిన్ ట్రూడో వ్యాఖ్యానించారు. 30 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులపై విధించే సుంకం ఈ మంగళవారం నుంచే అమల్లోకి వస్తుందని, మిగిలిన టారిఫ్‌లు 21 రోజుల తర్వాత అమలవుతాయని చెప్పారు. అమెరికాను స్వర్ణయుగంలా మార్చాలని ట్రంప్ అనుకుంటే తమతో భాగస్వామ్యాన్ని కోరుకోవాలని, అదే వారికి మంచిదని పేర్కొన్నారు. మెక్సికో కూడా కెనడా బాటలోనే నడుస్తోందని, తాము కూడా అమెరికా దిగుమతులపై సుంకాలు విధిస్తామని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ అన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా గ్రూపులతో మెక్సికో ప్రభుత్వానికి సంబంధాలు ఉన్నాయంటూ అమెరికా చేసిన ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు.

తమ ప్రభుత్వం 4 నెలల్లో 20 మిలియన్ డోస్ ఫెంటనిల్ సహా 40 టన్నులకు పైగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుందని, దాదాపు పదివేల మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. మెక్సికో ఎల్లప్పుడూ పొరుగు దేశాలతో సహకారం కోరుకుంటుందే తప్ప ఘర్షణను కాదని అన్నారు. మాదకద్రవ్యాలను అరికట్టాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించుకుంటే అందుకు కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అధిక సుంకాలు విధిస్తే సమస్యలు పరిష్కారం కావని క్లాడియా వ్యాఖ్యానించారు. మెక్సికన్ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగా ప్లాన్‌బీని అమలు చేయాలని ఆర్థిక కార్యదర్శిని ఆదేశిస్తున్నానని షేన్‌బామ్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు. మరోవైపు చైనాపై సుంకాలు విధించాలన్న ట్రంప్ నిర్ణయంపై చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ మండిపడింది. ప్రపంచ వాణిజ్య సంస్థలో అమెరికా నిర్ణయాన్ని సవాలు చేస్తామని ప్రకటించింది. కెనడా, మెక్సికోపై 25 శాతం, చైనాపై 10 శాతం సుంకాలు విధిస్తూ ట్రంప్ శనివారం తీసుకున్న నిర్ణయాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తమ దేశ ప్రయోజనాలు, హక్కులను కాపాడుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | సోమవారం, హైదరాబాద్ | 03-02-2025

ANN తెలుగు



# ఫోకస్ అంతా అల్లు అర్జున్ స్పీచ్‌పైనే..!

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య కాంపౌండ్ నుంచి వస్తోన్న తాజా ప్రాజెక్ట్ తండేల్. చందూమొండేటి డైరెక్షన్‌లో రొమాంటిక్ డ్రామా ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రంలో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తోంది. ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. తండేల్ మాస్ జాతర ఈవెంట్ నేడు హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరుగనుందని తెలిసిందే. ఈవెంట్‌కు అల్లు అర్జున్ ముఖ్య అతిథిగా రాబోతున్నాడు. కాగా గతేడాది డిసెంబర్ 4న రాత్రి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో పుష్ప 2 ది రూల్ బెనిఫిట్ షో నేపథ్యంలో అల్లు అర్జున్ రాక సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ (9)కు గాయలయ్యాయని తెలిసిందే.ఈ ఘటనలో అరెస్టైన అల్లు అర్జున్ బెయిల్‌పై విడుదల కూడా అయ్యాడు. మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం కూడా ప్రకటించి అండగా ఉంటామని హామీ కూడా ఇచ్చింది బన్నీ టీం. కాగా తండేల్ మాస్ జాతర ఈ ఘటన తర్వాత జరుగుతున్న ఈవెంట్ కావడం.. అందులోనా అల్లు అర్జున్ చీఫ్ గెస్ట్‌గా వెళ్తుండటంతో బన్నీ స్పీచ్ ఎలా ఉండబోతుందని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోన్న ఈ మూవీని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్యచందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా ఇది.

# చిరంజీవి కొత్త చిత్రం




కమర్షియల్ చిత్రాల్ని తనదైన పంథాలో తెరకెక్కిస్తూ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్నారు బాబీ కొల్లి. ఇటీవల 'డాకు మహారాజ్'తో భారీ విజయాన్ని సాధించారు. ఈ నేపథ్యంలో ఆయన తదుపరి సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. తాజా సమాచారం ప్రకారం చిరంజీవి కథానాయకుడిగా బాబీ కొల్లి ఓ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని తెలిసింది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. చిరంజీవి కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. ఈ నేపథ్యంలో వీరిద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా రాబోతుండటం విశేషం. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుందని తెలిసింది. ఇప్పటికే కథా చర్చలు పూర్తయ్యాయని అంటున్నారు. చిరంజీవి ప్రస్తుతం 'విశ్వంభర'లో నటిస్తున్నారు. మేలో ప్రేక్షకుల ముందుకురానుంది. దీని తర్వాత ఆయన అనిల్ రావిపూడి డైరెక్షన్స్‌లో సినిమా చేయబోతున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యాకే బాబీ కొల్లి డైరెక్ట్ చేసే సినిమా పట్టాలెక్కే అవకాశముందని సమాచారం.

# అసలు మనంఎక్కడున్నాం?



గత నెల 15న కేరళలో తోటి విద్యార్థుల వేధింపులు తట్టుకోలేక ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వ్యవహారంపై సినీ సెలబ్రిటీలు కూడా స్పందిస్తున్నారు. తాజాగా సమంత ఈ విషాదంపై తన సోషల్ మీడియా ద్వారా స్పందించారు. 'తాము ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి బయటకు వెల్లడిస్తే ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందోననే భయంతో చాలామంది మౌనంగానే బాధపడుతున్నారు. నిజానికి మనం అక్కడే విఫలం అవుతున్నాం. బెదిరింపులు, వేధింపులు, అవమానకర చర్యలు ఎదురైతే, వాటి గురించి బయటకు వెల్లడించాలి. అప్పుడే సమాజం అండ లభిస్తుంది. అప్పుడే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడేవారిని మనం ఎదుర్కోగలం. అసలు మనం ఎక్కడున్నాం!?. సమాజం మానసికంగా ఎంతో ఎదుగుతున్నా కూడా కొందరు మాత్రం మనసుల్లో ద్వేషమనే విషాన్ని నింపుకొని బతుకుతున్నారు. అలాంటి వ్యక్తుల కారణంగా ఓ బాలుడు తన జీవితాన్ని అంతం చేసుకున్నాడు.సాటి మనిషిని హేళనగా చూడటం.. ర్యాగింగ్‌లకు తెగబడటం ఎంతటి ప్రమాదకరమో ఈ ఘటన చెబుతున్నది. మన దగ్గర కఠినమైన చట్టాలున్నాయి. వాటిని మరింత కఠినతరం చేయాలి. ఘటనపై క్షుణ్ణంగా పరిశీలించి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి. సమాజానికి నేను చెప్పేదొక్కటే.. దయచేసి ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు సపోర్ట్‌గా నిలవండి.. ప్లీజ్..' అంటూ ఉద్వేగంగా స్పందించారు సమంత.




# హ్యాట్రిక్ కాంబినేషన్.. ది ప్యారడైజ్ స్టన్నింగ్ వార్త షేర్ చేసిన నాని

టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నాని అభిమానులను ఎంటర్‌టైన్ చేసేందుకు వరుస సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి దసరా ఫేం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నటిస్తోన్న ది ప్యారడైజ్ ప్రాజెక్టుగా వస్తోన్న ఈ మూవీకి సంబంధించి ఆసక్తికర విషయం షేర్ చేసింది నాని టీం. ఈ చిత్రానికి పాపురల్ మ్యూజిక్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించబోతున్నాడు. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. మా హ్యాట్రిక్ కాంబినేషన్.. అనిరుధ్‌కు స్వాగతం అంటూ ట్వీట్ చేశాడు నాని. ఇప్పటికే నానిఅనిరుధ్ కాంబోలో వచ్చిన జెర్సీ, గ్యాంగ్ లీడర్ సినిమాలు మంచి టాక్ తెచ్చుకున్నాయని తెలిసిందే. ఇక హ్యాట్రిక్ సినిమా ఎలా ఉండబోతుందోనని అప్పుడే చర్చించుకోవడం మొదలుపెట్టారు నెటిజన్లు, మూవీ లవర్స్.ఈ మూవీని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. హింస, రక్తపాతం, తుపాకులు. గ్లోరీ, ఒక మనిషి.. అంటూ ఇప్పటికే నాని శ్రీకాంత్ ఓదెల టీం విడుదల చేసిన లుక్ నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రంలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు మెయిన్ విలన్‌గా కనిపించబోతున్నాడని వార్తలు వస్తుండగా.. దీనిపై నాని టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. నాని మరోవైపు హిట్ ఫేం శైలేష్ కొలను డైరెక్షన్‌లో మూడో పార్ట్ హిట్ 3 కూడా చేస్తుండగా.. ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది.

## క్రీడా వార్తలు | SPORTS NEWS

# తెలంగాణ క్రికెట్ గర్వం

## భద్రాచలంకు చెందిన యువ క్రికెటర్..

- అండర్19 ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన.. బ్యాటింగ్, బౌలింగ్‌లో సమగ్ర ప్రతిభ..
- 7 మ్యాచుల్లో 309 పరుగులు.. స్కాట్లాండ్‌పై 110 పరుగుల సెంచరీ..
- 7 వికెట్లతో ఆల్‌రౌండర్‌గా ప్రతిభ.. చిన్నతనం నుంచి క్రికెట్‌తో అనుబంధం..
- మూడో తరగతి నుంచే క్రికెట్ ఆసక్తి.. 12 ఏళ్లకే రాష్ట్ర జట్టులో స్థానం..
- బీసీసీఐ 'ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' గౌరవం.. తెలంగాణ నుంచి మరో మిథాలీ రాజ్..
- భారత జట్టుకు ఎంపికైన రెండో హైదరాబాద్ క్రికెటర్
- న్యూజిలాండ్‌తో సిరీస్‌లో మెరిసిన త్రిష.. సీనియర్ జట్టులో స్థానం కోసం ఎదురుచూపులు
- తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రత్యేక పురస్కారం



**ఖమ్మం, ఫిబ్రవరి 2, మహా.** భారత క్రికెట్‌లో తెలంగాణ అమ్మాయిల హవా కొనసాగుతోంది. మహిళల అండర్ 19 ప్రపంచకప్‌లో భారత జట్టు ఘన విజయాన్ని అందుకోవడంలో కీలకపాత్ర పోషించిన గొంగడి త్రిష ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. భద్రాచలంకు చెందిన ఈ యువ క్రికెటర్ తన అద్భుత ప్రదర్శనతో టీమిండియాను ప్రపంచకప్ గెలిపించడంలో ప్రధాన భూమిక పోషించింది.

**ప్రపంచకప్‌లో గొంగడి త్రిష రికార్డులు**

అండర్19 మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు విజయ కేతనం ఎగురవేయడంలో గొంగడి త్రిష ప్రధాన పాత్ర పోషించింది. ఈ టోర్నమెంట్‌లో ఆమె 7 మ్యాచుల్లో 309 పరుగులు సాధించి, ఒక శతకం, ఒక అర్ధశతకం నమోదు చేసింది. బ్యాటింగ్‌లోనే కాకుండా, బౌలింగ్‌లోనూ తన ప్రతిభను చాటిన త్రిష, 7 వికెట్లు తీసి అద్భుత ప్రదర్శన కనబరిచింది.

**స్కాట్లాండ్‌పై చిరస్థాయిగా నిలిచే ఇన్నింగ్స్**

2025 జనవరి 28న స్కాట్లాండ్‌తో జరిగిన సూపర్ 6 మ్యాచ్‌లో త్రిష 59 బంతుల్లో 110 పరుగులు చేయడంతో రికార్డు బద్దలైంది. 13 ఫోర్లు, 4 సిక్సర్లతో అలరించిన ఆమె అండర్19 మహిళల టీ20 ప్రపంచకప్‌లో సెంచరీ చేసిన తొలి భారతీయ మహిళా బ్యాట్స్‌వుమన్‌గా చరిత్ర సృష్టించింది.

**తెలంగాణ నుండి మరో మిథాలీ రాజ్**

హైదరాబాద్‌కు చెందిన భారత మహిళా క్రికెట్ దిగ్గజం మిథాలీ రాజ్ తర్వాత, గొంగడి త్రిష తెలంగాణ నుంచి భారత జట్టులో స్థానం సంపాదించిన మరో ప్రతిభావంతమైన క్రికెటర్‌గా నిలిచింది. చిన్న వయస్సులోనే అద్భుత ప్రతిభ కనబరుస్తూ, భవిష్యత్తులో భారత మహిళల జట్టుకు ప్రధాన బలంగా మారే అవకాశం ఉన్న ఆల్‌రౌండర్‌గా గుర్తింపు పొందింది.

**చిన్నప్పటి నుంచే క్రికెట్‌పై మక్కువ**

గొంగడి త్రిష చిన్నతనం నుంచే క్రికెట్ పట్ల ఆసక్తి కనబరిచింది. మూడో తరగతి నుంచే ఆటలో తన ప్రతిభను చాటుతూ వచ్చింది. ఎనిమిదేళ్లకే అండర్16 జిల్లా జట్టులోకి ఎంపికై, ఉమెన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును గెలుచుకుంది. 12 ఏళ్ల వయస్సులో హైదరాబాద్ మహిళల జట్టుకు ఎంపికై తన అద్భుతమైన ఆటతో అందరి దృష్టిని ఆకర్షించింది.

**బీసీసీఐ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్**

ఆటలో తన ప్రదర్శనకు గుర్తింపుగా, బీసీసీఐ ఆమెను 'ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' అవార్డుతో గౌరవించింది. బ్యాటింగ్‌తో పాటు లెగ్ స్పిన్నర్‌గా కూడా ఆకట్టుకున్న త్రిష, అత్యధిక డాట్ బాల్స్ రికార్డును కూడా నెలకొల్పింది.

**అంతర్జాతీయ స్థాయికి ఎదుగుదల**

2022లో భారత అండర్19 టీ20 జట్టుకు ఎంపికైన త్రిష, అదే ఏడాది నవంబరు 27 నుంచి డిసెంబరు 6 వరకు న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచింది. తన బ్యాటింగ్, బౌలింగ్‌లో సత్తా చాటి అండర్19 ప్రపంచకప్ టీమిండియా మహిళల జట్టుకు ఎంపికయింది.

**ప్రతిభకు గుర్తింపు - తెలంగాణ ప్రభుత్వం గౌరవం**

త్రిష ఘనతను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం, 2023లో రాష్ట్ర విశిష్ట మహిళా పురస్కారాన్ని అందజేసింది. ఇది మహిళా క్రికెట్‌లో త్రిష సాధించిన విజయాలను మరింత ఘనంగా నిలిపే విధంగా నిలిచింది.

**భవిష్యత్తుపై భారీ ఆశలు**

భారత మహిళా క్రికెట్‌లో గొంగడి త్రిష తనదైన ముద్ర వేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రస్తుతం అండర్19 స్థాయిలో చెలరేగిపోతున్న ఈ యువ క్రికెటర్ భవిష్యత్తులో భారత మహిళల క్రికెట్‌లో ప్రధాన శక్తిగా మారనుంది. ఆమె ఆటతీరును చూస్తే, టీమిండియా సీనియర్ మహిళల జట్టులోనూ స్థానం సంపాదించేందుకు పెద్దగా సమయం పట్టదనిపిస్తోంది.

**స్ఫూర్తిదాయక క్రీడాకారిణి**

భద్రాచలం నుంచి వచ్చిన ఈ యువ క్రికెటర్ తన ఆటతీరుతో ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకుంది. దేశవ్యాప్తంగా ఎన్నో యువ క్రీడాకారిణులకు ఆమె ఆదర్శంగా నిలుస్తోంది. ఆమె సక్సెస్ స్టోరీ ఎంతో మందికి ప్రేరణనిస్తోంది.


## మన నారీ శక్తి పట్ల గర్విస్తున్నా..

### టీమిండియా వరల్డ్ కప్ గెలవడంపై ప్రధాని మోదీ స్పందన

### అండర్-19 వరల్డ్ కప్ గెలిచిన భారత అమ్మాయిలు

### అద్భుతమైన సమష్టి కృషి ఫలితం ఈ విజయం అంటూ ట్వీట్

మహా : భారత అమ్మాయిల జట్టు ఐసీసీ అండర్-19 మహిళల టీ20 వరల్డ్ కప్ గెలవడం పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ విజయం పట్ల యావత్ భారతదేశం సంతోషంతో పొంగిపోతోందన్నారు. 2023లో ఈ టోర్నీ తొలిసారిగా నిర్వహించగా, టైటిల్ గెలిచిన భారత్... 2025లోనూ టోర్నీలో విజేతగా నిలిచింది. మలేషియాలో జరిగిన ఈ ఐసీసీ ఈవెంట్ లో డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలో దిగిన టీమిండియా మహిళల జట్టు ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఓడించి టైటిల్ నిలబెట్టుకుంది. ఈ విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. మన నారీ శక్తి పట్ల అమితంగా గర్విస్తున్నానంటూ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. "ఐసీసీ అండర్-19 మహిళల టీ20 వరల్డ్ కప్-2025లో విజేతలుగా నిలిచినందుకు భారత జట్టుకు అభినందనలు. అద్భుతమైన సమష్టి కృషి, మన పట్టుదల, దృఢ సంకల్పం ఫలితమే ఈ విజయం. ఔత్సాహిక క్రీడాకారులకు ఈ గెలుపు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. టీమిండియా అమ్మాయిల జట్టు భవిష్యత్తులోనూ ఇలాంటి విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అంటూ మోదీ ట్వీట్ చేశారు.



# చివరి టీ-20లో ఇంగ్లండ్‌పై టీం ఇండియా 150 పరుగులతో విజయం..!

ఇంగ్లండ్, టీం ఇండియా మధ్య ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఆదివారం జరుగుతున్న చివరిఐదో టీ20 మ్యాచ్‌లో 248 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ బ్యాటర్లు భారత్ బౌలర్ల దాటికి విలవిలలాడారు. క్రీజ్‌లో నిలవలేక పోయారు. ఫలితంగా కేవలం 10.3 ఓవర్లలోనే 97 పరుగులకు ఆలౌట్ అయ్యారు. దీంతో 150 పరుగుల తేడాతో టీం ఇండియా భారీ విజయాన్ని నమోదు చేసింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 32 తేడాతో సొంతం చేసుకుంది. భారీ విజయ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఓపెనర్ ఫిల్ సాల్ట్ 23 బంతుల్లో ఏడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 55 పరుగులు చేసి మెరుపులు మెరిపించినా ఉపయోగం లేకపోయింది. మరో ఓపెనర్ బెన్ డకెట్ డకౌట్ అయ్యాడు. జాకబ్ బెతెల్ పది పరుగులు చేసి శివమ్ దూబే బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. మిగతా బ్యాటర్లెవరూ క్రీజ్‌లో నిలవలేక పోయారు. సారథి జాస్ బట్లర్ కేవలం ఏడు పరుగులకు వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో తిలక్ వర్మకు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాట పట్టాడు. హారీ బ్రూక్ రెండు, లియాం లివింగ్‌స్టోన్ తొమ్మిది పరుగులు, బ్రైడాన్ కార్స్ మూడు, అదిల్ రషీద్ ఆరు పరుగులు చేశారు. భారత్ బౌలర్లలో మహ్మద్ షమీ మూడు, వరుణ్ చక్రవర్తి, శివమ్ దూబె, అభిషేక్ శర్మ రెండేసి వికెట్ల చొప్పున తీసుకున్నారు. అంతకు ముందు ఇంగ్లండ్ జట్టు ముందు టీం ఇండియా 248 పరుగుల విజయ లక్ష్యాన్ని నిలిపింది. తొలుత టాస్ గెలుచుకున్న ఇంగ్లండ్ ఫీల్డింగ్ ఎంచుకున్నది. భారత్ ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ బ్యాటింగ్‌కు దిగినా సంజూ శాంసన్ ఏడు బంతుల్లో ఒక ఫోర్, రెండు సిక్సర్లతో 16 పరుగులు చేశాడు. మార్క్ వుడ్ బౌలింగ్‌లో జోఫ్రా అర్చర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ దారి పట్టాడు. వన్ డౌన్ బ్యాటర్ తిలక్ వర్మ, సారథి సూర్య కుమార్ యాదవ్ వెంటవెంటనే ఔటయినా అభిషేక్ శర్మ క్రీజ్‌లో నిలుచుండి పోయాడు. 37 బంతుల్లో స్పీడ్‌గా సెంచరీ పూర్తి చేసుకున్న అభిషేక్ శర్మ నిలకడగా ఆడి స్కోర్ పెంచాడు. మొత్తం 54 బంతుల్లో 135 పరుగులు చేసి అదిల్ రషీద్ బౌలింగ్‌లో జోఫ్రా ఆర్చర్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. శివం దూబె 13 బంతుల్లో 30 పరుగులు, అక్సర్ పటేల్ 15 పరుగులుచేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ మూడు, మార్క్ వుడ్ రెండు, జోఫ్రా ఆర్చర్, జామీ ఓవర్‌టన్, అదిల్ రషీద్ చెరో వికెట్ తీశారు. తొలుత టీం ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 247 పరుగులు చేసింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com